


గురువారం 8 అక్టోబర్ 2026 పేజీలు : 8

## కాంట్రాక్టు కార్మికులకు న్యాయమైన లాభాల వాటా చెల్లించాలి



గతేడాది రూ.5,000కే పరిమితం కాకుండా గణనీయంగా పెంచాలి

విప్లవ కార్మిక సంఘాల నాయకులు

# అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి



## నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలి:

## అదనపు కలెక్టర్ యువరాజ్ మర్మాట్

# రాష్ట్రస్థాయి పోలీస్ క్రీడల్లో ఆదిలాబాద్ జిల్లాకు మూడు కాంస్య పతకాలు





బ్యాడ్మింటన్‌లో సత్తా చాటిన జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది

గెజిటెడ్ అధికారుల విభాగంలో ఏఆర్ డీఎస్పీ కమతం ఇంద్రవర్ధన్‌కు కాంస్య పతకం

నాన్ గెజిటెడ్ డబుల్స్ విభాగంలో కానిస్టేబుళ్లు జాదవ్ కిషోర్, కె దేవ్‌రావ్ కు కాంస్య పథకం

విజేతలను అభినందించిన జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్



# వన్యప్రాణుల సంరక్షణ.. మానవ బాధ్యత

## అడవుల సంరక్షణతోనే మానవ మనుగడ సాధ్యం

## ప్రకృతిమిత్ర ఆధ్వర్యంలో అటవీ గ్రామాల ప్రజలకు అవగాహన

**జైపూర్ , 7, అక్టోబర్ (ప్రజాజ్యోతి):** జాతీయ వన్యప్రాణి సంరక్షణ వారోత్సవాల సందర్భంగా ప్రకృతిమిత్ర తెలంగాణ ఆధ్వర్యంలో మంచిర్యాల జిల్లా జైపూర్ మండలంలోని జాతీయ ఉత్తమ గ్రామంగా గుర్తింపు పొందిన ముదిగుంట గ్రామ శివారులోని అటవీ ప్రాంతంలో బుధవారం వన్యప్రాణుల సంరక్షణపై గ్రామ ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. “వన్యప్రాణుల సంరక్షణ.. మానవ బాధ్యత” అనే అంశంపై అటవీ, పోలీస్, రెవెన్యూ తదితర శాఖల అధికారులతో కలిసి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకృతిమిత్ర తెలంగాణ రాష్ట్ర వ్యవస్థాపకుడు, రాష్ట్ర ప్రభుత్వ వాల్టా చట్టం పర్యావరణవేత్త గుండేటి యోగేశ్వర్, జైపూర్ తహసీల్దార్ వనజారెడ్డి, ఎంపీడీవో సీపతి బాబురావు, డిప్యూటీ ఫారెస్ట్ రేంజ్ అధికారులు అజహార్ అబ్దుల్, సంతోష్ కుమార్ మాట్లాడుతూ, అడవుల సంరక్షణతోనే మానవ మనుగడ సాధ్యమవు తుందని, అడవుల వల్లే వర్షాలు కురుస్తాయని తెలిపారు.



# సోలార్ వినియోగం పెంచుకోండి విద్యుత్ బిల్లుల మోత తగ్గించుకోండి

**దిలావర్ పూర్ ,అక్టోబర్ 7,( ప్రజాజ్యోతి ).** పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన కింద దేశవ్యాప్తంగా సౌర గృహ రూఫ్‌టాప్ (ఇంటి పైకప్పులపై సోలార్ ప్యానెళ్లు) అమర్చడం జరుగుతుంది. సౌర విద్యుత్ వినియోగాన్ని ప్రోత్సహించడంతో పాటు విద్యుత్ ఖర్చులను తగ్గించేందుకు ఈ రోజు చిట్యాల్ లో సోలార్ వ్యవస్థను అమర్చినట్లు వెండర్ వినోద్ తెలిపారు. సోలార్ ఏర్పాటు చేసు కొనే వారు ఇంటి పైకప్పుపై నీడ పడని తగినంత స్థలం మరియు విద్యుత్ గ్రిడ్ కనెక్షన్ ఉండాలన్నారు పునరుత్పాదక ఇంధన వనరుల వినియోగాన్ని పెంచే దిశగా పీఎం సోలార్ ఏర్పాటు చేయడం ఉపయోగకరంగా ఉంటుందని స్థానికులు పేర్కొన్నారు. సౌర విద్యుత్ ద్వారా విద్యుత్ అవసరాలను కొంతవరకు తీర్చుకోవడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు కూడా దోహదపడుతుందని తెలిపారు.భారతదేశంలో పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన కింద దేశవ్యాప్తంగా సౌర గృహ రూఫ్‌టాప్ (ఇంటి పైకప్పులపై సోలార్ ప్యానెళ్లు) అమర్చిన కుటుంబాల సంఖ్య 50 లక్షల మార్కును దాటింది. దీని ద్వారా



దేశంలో మొత్తం రూఫ్‌టాప్ సోలార్ సామర్థ్యం సుమారు 14.8 గిగావాట్లకు చేరింది అన్నారు. సోలార్ పెట్టుకోవడానికి వెండర్‌ను ఎంచుకుని ఇన్‌స్టాలేషన్ చేయించ్చుకోవాలి ఇన్‌స్టాలేషన్ పూర్తయిన తర్వాత నెట్ మీటర్‌ను ఏర్పాటు చేస్తాం దీని ద్వారా మీరు వాడగా మిగిలిన అదనపు విద్యుత్ గ్రిడ్‌కు బదిలీ అవుతుంది మరియు మీకు బిల్లులో క్రెడిట్స్ వస్తాయి. అని తెలిపారు.. మరియు సబ్సిడీ జమ అవుతున్నది అధికారులు తనిఖీ చేసిన తర్వాత నేరుగా సబ్సిడీ డబ్బులు మీ బ్యాంక్ ఖాతాలో జమ చేయబడుతుంధన్నారు

# ఆర్టీసీ కార్మికుల కుటుంబాల్లో వెలుగులు నింపేందుకే పోటీ

**ఆరు నెలల్లో ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తాం లేదంటే యూనియన్‌నే రద్దు చేసుకుంటాం**

**కత్తెర గుర్తుతో బహుజన్ వర్కర్స్ యూనియన్ పోటీ టీఆర్‌పీ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు మహేష్ వర్మ**



**మంచిర్యాల, 7, అక్టోబర్ (ప్రజాజ్యోతి):** తెలంగాణ రాజ్యాధికార పార్టీ అనుబంధ సంఘమైన బహుజన్ వర్కర్స్ యూనియన్ (బీడబ్ల్యూయూ) తెలంగాణ ఆర్టీసీ గుర్తింపు సంఘం ఎన్నికల్లో కత్తెర గుర్తుతో పోటీ చేస్తుందని టీఆర్‌పీ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు మహేష్ వర్మ తెలిపారు. ఈ నెల 9న జరగనున్న ఆర్టీసీ గుర్తింపు సంఘం ఎన్నికల్లో మంచిర్యాల డిపో పరిధిలోని కార్మికులు కత్తెర గుర్తుపై ఓటు వేసి తమ ఐక్యతను చాటాలని ఆయన బుధవారం కోరారు. కొత్త నాయకత్వంతోనే ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారానికి బాటలు పడతాయని మహేష్ వర్మ అన్నారు. గతంలో హామీలు ఇచ్చిన పలు సంఘాలు, నాయకులు కార్మికుల సమస్యలను పరిష్కరించకుండా స్వార్థ రాజకీయాలకు ప్రాధాన్యత ఇచ్చారని ఆయన ఆరోపించారు. కొందరు నాయకులు రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో రాజకీయ అవకాశాల కోసం ఆర్టీసీ ఎన్నికల్లో పోటీ చేస్తున్నారని విమర్శించారు. మరికొన్ని సంఘాల నాయకులు తాము ఎందుకు పోటీ చేస్తున్నామో కూడా స్పష్టంగా చెప్పలేని పరిస్థితిలో ఉన్నారని అన్నారు. బహుజన్ వర్కర్స్ యూనియన్ ఆర్టీసీ కార్మికులకు భరోసా కల్పించడమే లక్ష్యంగా పోటీ చేస్తోందని మహేష్ వర్మ తెలిపారు. యూనియన్ అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం, కార్మికులకు ఇబ్బందికరంగా మారిన రిమూవల్ విధానాన్ని తొలగించి ఉద్యోగ భద్రత కల్పించడం, ఔట్‌సోర్సింగ్ విధానాన్ని రద్దు చేసి రెగ్యులర్ ఉద్యోగాల కల్పనకు కృషి చేయడం తమ ప్రధాన డిమాండ్లని పేర్కొన్నారు. ఆర్టీసీ కార్మికుల కుటుంబాల్లో వెలుగులు నింపేందుకే కత్తెర గుర్తుతో పోటీ చేస్తున్నామని స్పష్టం చేశారు. తీన్మార్ మల్లన్న



నాయకత్వంలో కార్మిక సంఘం ఎలా పనిచేయాలో చేసి చూపిస్తామని, ఒక్క అవకాశం ఇవ్వాలని మహేష్ వర్మ కోరారు. ఆరు నెలల్లో ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తామని, ఆ హామీని నెరవేర్చలేకపోతే యూనియన్‌ను రద్దు చేసుకుంటామని తీన్మార్ మల్లన్న ప్రకటించారని ఆయన తెలిపారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి తమ సంఘానికి మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా ఆర్టీసీ కార్మికులకు బహుజన్ వర్కర్స్ యూనియన్ గ్యారంటీ కార్డులను జిల్లా అధ్యక్షుడు మహేష్ వర్మ అందించారు. కార్యక్రమంలో టీఆర్‌పీ జిల్లా కార్యదర్శి పడాల శివతేజ, సోషల్ మీడియా కన్వీనర్ మహమ్మద్ లతీఫ్, బూర రవీందర్, బొంగోని విద్యాసాగర్, ఆడిచర్ల రూపదేవి, చాపిడి ప్రశాంత్, బుద్దార్తి స్వామి, వాసాల అనిల్, భీమిని రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఈఈ రాథోడ్ తుకారాంను మర్యాదపూర్వకంగా కలిసిన మై భారత్ వాలంటీర్లు



**మామడ అక్టోబర్ 8( ప్రజా జ్యోతి)** నిర్మల్ పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఈఈ)గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన రాథోడ్ తుకారాంను మై భారత్ నిర్మల్ జిల్లా వాలంటీర్లు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో సత్కరించి చిరు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. మై భారత్ నిర్మల్ జిల్లా వాలంటీర్లు ఎలిగేటి వంశీకృష్ణ నేత, రాథోడ్ ఉమేష్ ఈఈ రాథోడ్ తుకారాంకు శుభాకాంక్షలు తెలిపారు.జిల్లాలో పంచాయతీరాజ్ శాఖ పరిధిలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధి తదితర అంశాలపై ఈ సందర్భంగా చర్చించినట్లు తెలిపారు.బాధ్యతలు స్వీకరించిన రాథోడ్ తుకారాంకు అభినందనలు తెలియజేస్తూ, ఆయన సేవలు జిల్లాకు మరింత ప్రయోజనం చేకూర్చాలని ఆకాంక్షించారు.

## జన్నారం డివిజన్ లో వన్యప్రాణి వారోత్సవాలు.





**జన్నారం,అక్టోబర్ 7(ప్రజాజ్యోతి)** జన్నారం ఎఫ్డివో రామ్మోహన్ ఆధ్వర్యంలో డివిజన్‌లోని జన్నారం, ఇంధనపెల్లి, తాళ్లపేట రేంజ్ లలో జాతీయ వన్యప్రాణి వారోత్సవాలను బుధవారం రోజున ఘనంగా నిర్వహించారు. జన్నారం, ఇంధనపెల్లి రేంజ్ లలో ఎఫ్ ఆర్ వో బాబా ఖాదర్ వలీ ఆధ్వర్యంలో జన్నారం రేంజ్ లో లిటిల్ హార్స్,కృష్ణవేణి పాఠశాలల విద్యార్థులచే అటవీశాఖ కార్యాలయం నుండి బస్టాండ్ వరకు,ఇంధనపెల్లి రేంజ్ లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులచే ఇందన పెల్లి రేంజ్ కార్యాలయం నుండి ర్యాలీ నిర్వహించారు.తాళ్లపేట రేంజ్ లో ఎఫ్ ఆర్ వో జి వికాస్ ఆధ్వర్యంలో తపాలా పూర్ చెక్పోస్ట్ నుండి 19వ డిస్ట్రిబ్యూటర్ కెనాల్ వరకు వన్ కె రన్నింగ్ నిర్వహించి వనదర్శిని కార్యక్రమం చేపట్టారు. వనదర్శిని కార్యక్రమంలో భాగంగా యువకులను అడవిలోకి తీసుకెళ్లి వన్యప్రాణులు,పక్షులు,చెట్ల గురించి మరియు అడవిలో చేపట్టిన అభివృద్ధి గురించి వివరించారు.అనంతరం అడవులను, వన్యప్రాణులను సంరక్షించాల్సిన బాధ్యత మనందరిది అని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓలు మమత, సాగరిక, రాము, సెక్షన్ అధికారులు శంకర్, శివకుమార్, నరేష్, అతావుల్లా, భగవంతు రావు, బీట్ అధికారులు ఎల్ అనిల్ నాయక్ ,రవి నాయక్, లక్ష్మణ్ ,సంతోష్, మంగ, రహీముద్దీన్, స్వచ్ఛంద సంస్థ బయాలోజిస్ట్ అనగందుల వెంకట్, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ చీరల పంపిణీలో కొందరు మహిళలకుఅన్యాయం



ఖానాపూర్ అక్టోబర్ 7(ప్రజాజ్యోతి ) ఇందిరమ్మ చీరల పంపిణీలో కొందరు మహిళ ఆడపడుచులకు అన్యాయం జరుగుతుందనీ వాపోతున్నారు గతంలో ఇందిరమ్మ( బతుకమ్మల పేరా ) చీరలు రేషన్ కార్డు ఆధారంగా పంపిణి జరిగేది అయితే కాంగ్రెస్ ప్రజాప్రభుత్వం లో కేవలం డ్వాక్రా గ్రూపులో ఉన్న మహిళకే పంపిణి చేయడం వల్ల గ్రూపుల్లో లేని అడపడుచులకు ఇందిరమ్మ చీరలు రాక ఆవేదన చెందుతున్నారు పాత పద్ధతిలోనే రేషన్ కార్డు ఆధారంగా ఇందిరమ్మ చీరల పంపిణీ చేయాలని మహిళలు కోరుతున్నారు వెంటనే తెల్ల రేషన్ కార్డ్ కల మహిళలందరికీ ఇందిరమ్మ చీరల పంపిణీ చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు

## తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో

ఘనంగా బతుకమ్మ వేడుకలు





మంచిర్యాల, అక్టోబర్ 7 (ప్రజా జ్యోతి): మంచిర్యాల జిల్లాలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో ఘనంగా బతుకమ్మ వేడుకలను బుధవారం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పత్తి సునీత ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో విద్యార్థినులు అధ్యాపకుల సహకారంతో వివిధ రకాల రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చారు. అనంతరం బతుకమ్మల చుట్టూ చేరి బతుకమ్మ పాటలు పాడుతూ విద్యార్థినులు, అధ్యాపకులు ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ వహీదా, అధ్యాపకులు, విద్యార్థినులు సంప్రదాయ దుస్తుల్లో పాల్గొని తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రాంగణం రంగురంగుల బతుకమ్మలతో సందడిగా మారింది. కార్యక్రమాన్ని కల్చరల్ కోఆర్డినేటర్ ఎం. జ్యోతి, ఎన్ఎస్ఎస్ యూనిట్--1, యూనిట్--2 ప్రోగ్రాం ఆఫీసర్లు ఎం.డి. రిజ్వానా, ఎస్. సత్యరాణి తదితరులు సమన్వయంతో నిర్వహించారు.

# సమ్మె లేకుండానే 24 డిమాండ్లపై ఒప్పందం చేసుకున్నాం

**వాస్తవ లాభాలను ప్రకటించి 40 శాతం వాటా చెల్లించాలి**

**సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ)**

**రాష్ట్ర అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య**





**మంచిర్యాల, 7, అక్టోబర్ (ప్రజాజ్యోతి):** కార్మికుల హక్కులు, సమస్యల పరిష్కారం కోసం ఏఐటీయూసీ నిరంతరం పోరాటం చేస్తోందని తెలిపారు. జూన్ 8న ఏఐటీయూసీ ఇచ్చిన సమ్మె నోటీసుపై ఆర్ఎల్‌సీ సమక్షంలో జరిగిన చర్చలు, యాజమాన్యంపై కొనసాగించిన నిరంతర ఒత్తిడి ఫలితంగా సమ్మెకు వెళ్లకుండానే 24 ప్రధాన డిమాండ్లపై ఒప్పందం సాధించామని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య తెలిపారు . సింగరేణి గుర్తింపు కార్మిక సంఘమైన సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ శ్రీరాంపూర్ బ్రాంచ్ ఆధ్వర్యంలో బుధవారం మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ ఏరియా వర్క్‌షాప్‌లో నిర్వహించిన గేట్ మీటింగ్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 2025--26 ఆర్థిక సంవత్సరానికి సింగరేణి సంస్థకు వచ్చిన వాస్తవ లాభాలను వెంటనే ప్రకటించి, అందులో 40 శాతం వాటాను కార్మికులకు చెల్లించాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య డిమాండ్ చేశారు. ఈ ఒప్పందంలో భాగంగా పెర్క్స్‌పై ఆదాయపు పన్నును యాజమాన్యమే భరించడం, సర్వీసులో సహజ మరణం పొందిన కార్మికుడి కుటుంబానికి రూ.20 లక్షల ఆర్థిక సహాయం, బదిలీ నిబంధనల్లో మార్పులు, అర్హులైన సీనియర్ మైనింగ్ స్టాఫ్‌కు పదోన్నతులు, హైదరాబాద్‌లో సింగరేణి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఏర్పాటు, మెడికల్ అటెండెన్స్ నిబంధనల్లో మార్పులు, సింగరేణి విద్యాసంస్థల్లో సీబీఎస్ఈ సిలబస్ అమలు, కాంట్రాక్ట్ కార్మికులకు ఈఎస్ఐ వైద్య సదుపాయం, డిపెండెంట్ ఉద్యోగాల పెండింగ్ కేసుల పరిష్కారం, ఖాళీ పోస్టుల భర్తీ, క్యాడర్ స్కీమ్ తదితర అంశాలపై ఒప్పందం కుదిరిందన్నారు. అలాగే మెడికల్ ఫిట్ అయిన 149 మంది డిపెండెంట్లకు ఆఫీస్ ఆర్డర్లు జారీ చేయడం, కార్మికులకు సేఫ్టీ మెటీరియల్‌ను సకాలంలో సరఫరా చేయడం, మైనింగ్ స్టాఫ్‌కు వారి అర్హతలకు అనుగుణంగా తగిన సర్ఫేస్ ఉద్యోగాలు కల్పించడం, డిస్మిస్ కార్మికుల పెండింగ్ కేసుల పరిష్కారం, సొంత ఇంటి పథకంపై కమిటీ ఏర్పాటు, నూతన బొగ్గు గనుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వడం వంటి అంశాలపై కూడా ఒప్పందం సాధించామని సీతారామయ్య తెలిపారు. సింగరేణి సంస్థ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని బొగ్గు బ్లాకుల వేలంలో సింగరేణి చురుకుగా పాల్గొని కొత్త గనులను సొంతం చేసుకునేలా యాజమాన్యం చర్యలు తీసుకోవాలని సూచించారు. దీనివల్ల సంస్థ ఉత్పత్తి సామర్థ్యం పెరగడంతో పాటు ఉపాధి అవకాశాలు విస్తరించి, కార్మికుల భవిష్యత్తు ప్రయోజనాలు కాపాడబడతాయని అన్నారు. కార్మికుల శ్రమతో సింగరేణి సంస్థకు వచ్చిన వాస్తవ లాభాలను వెంటనే ప్రకటించి, 40 శాతం వాటాను కార్మికులకు చెల్లించాలని మరోసారి డిమాండ్ చేశారు. పోరాటాల ద్వారానే కార్మికులు తమ హక్కులను సాధించుకోగలరని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు కందికట్ల వీరభద్రయ్య, ముష్కే సమ్మయ్య, శ్రీరాంపూర్ బ్రాంచ్ కార్యదర్శి ఎస్కే బాజీ సైదా, జీఎం కమిటీ చర్చల ప్రతినిధులు బద్రి బుచ్చయ్య, సురేష్, జిల్లా కార్యదర్శి అఫ్రోజ్ ఖాన్, ఫిట్ కార్యదర్శులు గునిగంటి నర్సింగరావు, సదానందం, నాయకులు దామోదర్, శ్రీనివాస్, రాఘవ రాజు, బుచ్చన్న, రవీందర్, వినోద్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# కార్పొరేట్ మెడికల్ బోర్డు విధానాన్ని పునఃసమీక్షించాలి

**తీవ్ర అనారోగ్యంతో విధులు నిర్వహించలేని కార్మికులకు న్యాయం చేయాలి**

**ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్**



**మంచిర్యాల, 7, అక్టోబర్ (ప్రజాజ్యోతి):** సింగరేణి సంస్థలో నిర్వహిస్తున్న కార్పొరేట్ మెడికల్ బోర్డు విధానాన్ని యాజమాన్యం పునఃసమీక్షించి, తీవ్ర అనారోగ్యంతో విధులు నిర్వహించలేని కార్మికులకు న్యాయం చేయాలని ఏఐటీయూసీ డిమాండ్ చేసింది. ఇటీవల నిర్వహించిన కార్పొరేట్ మెడికల్ బోర్డుల్లో అనారోగ్య కారణాలతో విధులకు అనర్హులుగా నిర్ధారించబడుతున్న కార్మికుల సంఖ్య చాలా తక్కువగా ఉండటం ఆందోళన కలిగించే అంశమని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ అన్నారు. గత నాలుగు మెడికల్ బోర్డుల్లో వరుసగా సుమారు నాలుగు శాతం, 14 శాతం, 10 శాతం మాత్రమే కార్మికులను అన్‌ఫిట్‌గా నిర్ధారించిన పరిస్థితిని యాజమాన్యం సమగ్రంగా సమీక్షించాలని కోరారు. ముఖ్యంగా గుండెకు స్టెంట్లు వేయించుకున్న కార్మికులు, కిడ్నీ సంబంధిత తీవ్రమైన అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారు, శారీరకంగా కఠినమైన విధులు నిర్వహించలేని స్థితిలో ఉన్న కార్మికులు సైతం అన్‌ఫిట్‌గా నిర్ధారించబడకపోవడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే నాలుగుసార్లు మెడికల్ బోర్డులు నిర్వహించిన నేపథ్యంలో, తీవ్రమైన అనారోగ్య సమస్యలతో విధులు నిర్వహించలేని కార్మికులను గుర్తించేందుకు రీ-మెడికల్ బోర్డు ఏర్పాటు చేసి మరోసారి సమగ్ర వైద్య పరీక్షలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. వైద్యపరంగా అర్హత కలిగిన కార్మికులను నిబంధనల ప్రకారం అన్‌ఫిట్‌గా నిర్ధారించి వారికి న్యాయం చేయాలని కోరారు. మెడికల్ బోర్డు ప్రక్రియ కేవలం హైదరాబాద్ నుంచి వచ్చే వైద్యుల అభిప్రాయాలకే పరిమితం కాకుండా కార్మికుల వాస్తవ ఆరోగ్య పరిస్థితి, వారు నిర్వహిస్తున్న విధుల స్వభావం, శారీరక సామర్థ్యం, వైద్య నివేదికలు, దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలు తదితర అంశాలను సమగ్రంగా పరిగణనలోకి తీసుకోవాలని యాజమాన్యాన్ని కోరారు. మెడికల్ బోర్డుల నిర్వహణలో ఏకరీతి విధానం, పారదర్శకత, వైద్యపరమైన న్యాయం పాటించాలని సూచించారు. గతంలో అమలు చేసిన విధానాలను కూడా పునఃపరిశీలించి, తీవ్రమైన అనారోగ్యంతో విధులు నిర్వహించలేని ప్రతి అర్హత కలిగిన కార్మికుడికి నిబంధనల ప్రకారం అన్‌ఫిట్ ధ్రువీకరణ లభించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం సుమారు 1,800 మంది కార్మికులు అన్‌ఫిట్ కోసం ఎదురుచూస్తున్నారని, వారిలో అనేక మంది అనారోగ్య కారణాలతో సాధారణ విధులు నిర్వహించలేక కుటుంబాలను పోషించడంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కార్మికుల ఆరోగ్యం, వారి కుటుంబాల ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని మానవతా దృక్పథంతో మెడికల్ బోర్డు ప్రక్రియను నిర్వహించాలని, వైద్యపరంగా అర్హత కలిగిన ప్రతి కార్మికుడికి న్యాయం చేయాలని సింగరేణి యాజమాన్యాన్ని ఏఐటీయూసీగా కోరుతున్నామని ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ తెలిపారు.

# వన్యప్రాణుల సంరక్షణ.. మానవ బాధ్యత

## అడవుల సంరక్షణతోనే మానవ మనుగడ సాధ్యం

## ప్రకృతిమిత్ర ఆధ్వర్యంలో అటవీ గ్రామాల ప్రజలకు అవగాహన







**జైపూర్ , 7, అక్టోబర్ (ప్రజాజ్యోతి):** జాతీయ వన్యప్రాణి సంరక్షణ వారోత్సవాల సందర్భంగా ప్రకృతిమిత్ర తెలంగాణ ఆధ్వర్యంలో మంచిర్యాల జిల్లా జైపూర్ మండలంలోని జాతీయ ఉత్తమ గ్రామంగా గుర్తింపు పొందిన ముదిగుంట గ్రామ శివారులోని అటవీ ప్రాంతంలో బుధవారం వన్యప్రాణుల సంరక్షణపై గ్రామ ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. "వన్యప్రాణుల సంరక్షణ.. మానవ బాధ్యత" అనే అంశంపై అటవీ, పోలీస్, రెవెన్యూ తదితర శాఖల అధికారులతో కలిసి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకృతిమిత్ర తెలంగాణ రాష్ట్ర వ్యవస్థాపకుడు, రాష్ట్ర ప్రభుత్వ వాల్టా చట్టం పర్యావరణవేత్త గుండేటి యోగేశ్వర్, జైపూర్ తహసీల్దార్ వనజారెడ్డి, ఎంపీడీవో సీపతి బాబురావు, డిప్యూటీ ఫారెస్ట్ రేంజ్ అధికారులు అజహర్ అబ్దుల్, సంతోష్ కుమార్ మాట్లాడుతూ, అడవుల సంరక్షణతోనే మానవ మనుగడ సాధ్యమవుతుందని, అడవుల వల్లే వర్షాలు కురుస్తాయని తెలిపారు. అడవుల నరికివేతతో వన్యప్రాణులకు ఆవాసాలు కరువవుతున్నాయని, ప్రతి ఒక్కరూ అడవులు, వన్యప్రాణుల సంరక్షణకు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. మార్కెట్‌కు వెళ్లేటప్పుడు వస్త్ర సంచులను వినియోగించాలని, సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌కు దూరంగా ఉండాలని కోరారు. భారత రాజ్యాంగంలోని 51(ఎ)(జి) ప్రకారం ప్రకృతి, పర్యావరణాన్ని పరిరక్షించడం ప్రతి పౌరుడి బాధ్యత అని అన్నారు. ప్రస్తుతం ఎదుర్కొంటున్న ఎల్‌నినో వంటి వాతావరణ మార్పులు, అకాల ఎండలు, ఉష్ణోగ్రతల పెరుగుదలకు పచ్చదనం తగ్గిపోవడం, అడవుల నరికివేత, వన్యప్రాణుల వేట, అడవుల్లో నిప్పు పెట్టడం వంటి కారణాలు ప్రధానమని వివరించారు. అడవులను తల్లిలాగా, వన్యజీవులను కుటుంబ సభ్యులుగా భావించి గౌరవించాలని పిలుపునిచ్చారు. అడవులు, వన్యజీవులను కాపాడే బాధ్యతలో గ్రామ ప్రజలు భాగస్వాములు కావాలని సూచించారు. జాతీయ ఉత్తమ గ్రామంగా గుర్తింపు పొందిన ముదిగుంట సర్పంచ్ ఆకుల రవికుమార్, ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ ముదిగుంట, మిట్టపల్లి, కాన్కూర్ గ్రామాల పరిధిలో అడవులు, వన్యప్రాణుల సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని తెలిపారు. గ్రామాల్లో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిషేధించేలా ప్రజల్లో అవగాహన కల్పిస్తామన్నారు. అనంతరం అటవీ ప్రాంతంలో ఏర్పాటు చేసిన వివిధ ప్రకృతి సిద్ధ పదార్థాలతో తయారు చేసిన వస్తువుల ప్రదర్శనను అధికారులు, ప్రజలు తిలకించారు. అనంతరం గ్రామ ప్రజలు అటవీ ప్రాంతంలో కలియతిరిగి ప్రకృతి అందాలను ఆస్వాదించారు. ఈ సందర్భంగా "వన్యజీవుల రక్షణ.. భావితరాలకు రక్షణ", "అడవులతోనే మనం.. లేకుంటే మరణం", "పులి అడవి కోసం.. అడవి పులి కోసం", "వన్యప్రాణుల రక్షణ మనందరి బాధ్యత", "అడవికి నిప్పు.. భవితకు ముప్పు", "అడవుల్లో ప్లాస్టిక్ వినియోగాన్ని మానుదాం" అంటూ నినాదాలు చేశారు. అనంతరం ప్రకృతిమిత్ర వ్యవస్థాపకుడు గుండేటి యోగేశ్వర్, సర్పంచ్, వివిధ శాఖల అధికారులతో కలిసి వన్యప్రాణుల సంరక్షణపై గ్రామ ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం గ్రామ సర్పంచులను సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రకృతిమిత్ర సాహితీ విభాగం బాధ్యులు, ప్రముఖ కవి గోపగాని రవీందర్, మిట్టపల్లి, కాన్కూర్ సర్పంచులు, ఉపసర్పంచులు, మాజీ సర్పంచులు, అటవీ అధికారులు కామెర మనోహర్, పోడేటి సురేష్, రామా గౌడ్, వెంకటేశ్వర గౌడ్, పత్తి సంధ్యారాణి, పెద్ది రాజు, మహిళా సమాఖ్య విజయ, సీసీ ఆరనక్క రాజన్నతో పాటు పరిసర గ్రామాల ప్రజలు, మహిళలు, యువత ఉత్సాహంగా పాల్గొన్నారు.

# మోదీ ప్రజాసేవకు 25 ఏళ్లు.. మంచిర్యాలలో ఘనంగా సేవా సంకల్ప అభియాన్

### కాగడాల ర్యాలీతో సేవా జ్యోతి యాత్ర

### భారీగా పాల్గొన్న బీజేపీ నాయకులు..






**మంచిర్యాల, 7, అక్టోబర్ (ప్రజాజ్యోతి):** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వాధినేతగా 25 సంవత్సరాల ప్రజాసేవను పూర్తి చేసుకున్న సందర్భంగా భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవా సంకల్ప అభియాన్, సేవా జ్యోతి కార్యక్రమాలు మంచిర్యాల పట్టణంలో ఘనంగా నిర్వహించారు. బీజేపీ జిల్లా అధ్యక్షులు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్ ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని హోటల్ సుచిత్ర ఇన్ ఎదుట ఎల్ఈడీ స్క్రీన్ ఏర్పాటు చేసి, ప్రధాని నరేంద్ర మోదీ జాతిని ఉద్దేశించి చేసిన ప్రత్యక్ష ప్రసంగాన్ని పార్టీ నాయకులు, కార్యకర్తలు వీక్షించారు. అనంతరం మంచిర్యాల రైల్వే స్టేషన్ నుంచి బెల్లంపల్లి చౌరస్తా వరకు కాగడాల ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలివచ్చారు. జాతీయస్థాయి వాలీబాల్ పోటీల్లో కాంస్య పతకం సాధించిన రామ్మోహన్ విశిష్ట అతిథిగా, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కిషోర్ రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి కన్నెబోయిన ఓదెలు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్, ముఖ్య అతిథులు మాట్లాడుతూ 2001 అక్టోబర్ 7న నరేంద్ర మోదీ గుజరాత్ ముఖ్యమంత్రిగా తొలిసారి బాధ్యతలు చేపట్టారని, అనంతరం మూడుసార్లు గుజరాత్ ముఖ్యమంత్రిగా, 2014 నుంచి దేశ ప్రధానమంత్రిగా ప్రజాసేవను కొనసాగిస్తున్నారని తెలిపారు. మోదీ 25 ఏళ్ల ప్రజాసేవా ప్రస్థానం ప్రజల విశ్వాసం, నమ్మకంతో కొనసాగుతోందని పేర్కొన్నారు. రాజకీయ కుటుంబ వారసత్వం లేకుండా అంకితభావం, కష్టపడే తత్వంతో అంచెలంచెలుగా ఎదిగి దేశ నాయకత్వ బాధ్యతలు చేపట్టిన ఆయన ప్రస్థానం ప్రజాస్వామ్యంలో స్ఫూర్తిదాయకమని అన్నారు. సేవా సంకల్ప అభియాన్ కార్యక్రమాలు గత విజయాలను గుర్తుచేసుకోవడంతో పాటు, భవిష్యత్తులో దేశాన్ని సర్వతోముఖాభివృద్ధి వైపు నడిపించేందుకు, ప్రజలకు మరింత చేరువయ్యేందుకు నూతన ఉత్సాహాన్ని అందిస్తాయని పేర్కొన్నారు. సేవా జ్యోతి యాత్ర ద్వారా ప్రజల్లో సేవాభావం, దేశాభివృద్ధి పట్ల అవగాహన కల్పించడమే లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో సేవా సంకల్ప అభియాన్ జిల్లా కన్వీనర్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు పట్టి వెంకటకృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శులు ఎనగందుల కృష్ణమూర్తి, వెంకటేశ్వరరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దుర్గం అశోక్, బీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గాజుల ముఖేష్ గౌడ్, రాష్ట్ర మీడియా ప్యానలిస్ట్ తుల ఆంజనేయులు, కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి రమణారావు, ఉపాధ్యక్షులు కోడి రమేష్, కమలాకర్ రావు, సేవా సంకల్ప అభియాన్ కో-కన్వీనర్లు మోటాపలుకుల తిరుపతి, కస్తూరి నాగరాజు, జిల్లా కార్యదర్శులు వైద్య శ్రీధర్, రాచర్ల సంతోష్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు బియ్యాల సతీష్ రావు, సుధీర్ గౌడ్, కార్పొరేటర్లు బోట్ల అనిత, సత్యం, జోనల్ అధ్యక్షులు, వివిధ మోర్చాల నాయకులు, బీసీ మోర్చా అధ్యక్షులు ఆకుల అశోక్ వర్ధన్, ఎస్టీ మోర్చా అధ్యక్షులు ప్రేమ్ సింగ్, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రజాస్వామ్యాన్ని అణిచివేస్తే చూస్తూ ఊరుకోం

ప్రజల ఓటు హక్కు కోసం చివరి వరకు పోరాడతాం

పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ



**మంచిర్యాల, 7, అక్టోబర్ (ప్రజాజ్యోతి):** ప్రజాస్వామ్యాన్ని అణిచివేస్తే చూస్తూ ఊరుకోమని, ప్రజల ఓటు హక్కు కోసం చివరి వరకు పోరాడతామని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ స్పష్టం చేశారు . దేశ ప్రజాస్వామ్య వ్యవస్థకు సంబంధించిన పరిణామాలను ప్రపంచం మొత్తం గమనిస్తోందని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ అన్నారు. ఎన్నికల కమిషన్ అత్యంత కీలకమైన రాజ్యాంగ సంస్థ అని, అది పారదర్శకంగా, నిష్పక్షపాతంగా పనిచేయాల్సిన అవసరం ఉందని తెలిపారు .300 మందికి పైగా ఎంపీలు ఎన్నికల కమిషనర్‌ను కలిసి తమ అభిప్రాయాలు, ఆందోళనలను తెలియజేసేందుకు వెళ్లినప్పటికీ వారితో సమావేశం కాకపోవడం ఏ విధమైన ప్రజాస్వామ్య పద్ధతి అని వంశీకృష్ణ ప్రశ్నించారు. ప్రజాప్రతినిధులతో చర్చించకుండా నిర్ణయాలు తీసుకోవడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు. శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న ఎంపీలను పోలీసులు అడ్డుకోవడం, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరుపై కూడా ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య హక్కుల కోసం ప్రశ్నిస్తున్న ప్రజాప్రతినిధుల గొంతును బలప్రయోగంతో అణచివేయలేరన్నారు . ఫారం-6లో కీలకమైన మార్పులను ఇతర ఎన్నికల కమిషన్ సభ్యులతో తగిన సంప్రదింపులు లేకుండా ఏకపక్షంగా ఎలా చేపడతారని వంశీకృష్ణ ప్రశ్నించారు. ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన కీలక నిర్ణయాల్లో పారదర్శకత, సంప్రదింపులు, జవాబుదారీతనం ఉండాలని డిమాండ్ చేశారు. పశ్చిమ బెంగాల్‌లో సుమారు 90 లక్షల ఓట్లు తొలగించబడ్డాయని, వాటిలో 93 శాతం ఓట్లు తిరిగి పునరుద్ధరించబడ్డాయని పేర్కొంటూ, ఓటర్ల జాబితా నిర్వహణకు సంబంధించి ఎన్నికల కమిషన్ దేశ ప్రజలకు స్పష్టమైన వివరణ ఇవ్వాలని కోరారు. "ఓటు కేవలం ఒక సంఖ్య కాదు.. ప్రతి ఓటు వెనుక ఒక పౌరుడి హక్కు ఉంది. ఆ హక్కుకు సంబంధించిన ప్రతి నిర్ణయం పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా ఉండాలి అని అన్నారు. లోక్‌సభలో ప్రతిపక్ష నేత కూడా ప్రధాన ఎన్నికల కమిషనర్ ఎంపిక ప్రక్రియలో భాగస్వామి అని గుర్తుచేసిన వంశీకృష్ణ.. అలాంటి రాజ్యాంగబద్ధమైన పాత్ర కలిగిన ప్రతిపక్ష నేతతో ఎన్నికల కమిషనర్ సమావేశం కాకపోవడంపై ప్రశ్నలు తలెత్తుతున్నాయని అన్నారు. దేశ ఎన్నికల వ్యవస్థపై ప్రజలకు నమ్మకం ఉండాలంటే ఎన్నికల కమిషన్ స్వతంత్రంగా, పారదర్శకంగా, నిష్పక్షపాతంగా, జవాబుదారీతనంతో పనిచేయాలని పేర్కొన్నారు. ఇది ఏ ఒక్క పార్టీకి సంబంధించిన విషయం కాదని, ప్రజాస్వామ్య వ్యవస్థ, ప్రజల ఓటు హక్కు, ఎన్నికల సంస్థల విశ్వసనీయతకు సంబంధించిన అంశమని అన్నారు. ప్రజల ఓటు హక్కును, ప్రజాస్వామ్య సంస్థల స్వతంత్రతను కాపాడే వరకు తమ పోరాటం కొనసాగుతుందని ఎంపీ గడ్డం వంశీకృష్ణ స్పష్టం చేశారు.

# కాంట్రాక్టు కార్మికులకు న్యాయమైన లాభాల వాటా చెల్లించాలి

## గతేడాది రూ.5,000కే పరిమితం కాకుండా గణనీయంగా పెంచాలి

## విప్లవ కార్మిక సంఘాల నాయకులు




మంచిర్యాల, 7, అక్టోబర్ (ప్రజాజ్యోతి): సింగరేణి కాలరీస్‌లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు గత సంవత్సరం చెల్లించిన రూ.5,000 లాభాల వాటాను ఈసారి కూడా యథాతథంగా చెల్లించకుండా, పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలు, జీవన వ్యయం, కుటుంబ అవసరాలను పరిగణనలోకి తీసుకుని లాభాల వాటాను గణనీయంగా పెంచి చెల్లించాలని విప్లవ కార్మిక సంఘాలనాయకులు డిమాండ్ చేశారు.గత సంవత్సరం రూ.5,000 చెల్లించారని, అయితే ఈ ఏడాది నిత్యావసర వస్తువుల ధరలు, కుటుంబ ఖర్చులు గణనీయంగా పెరిగాయని సంఘాల నాయకులు పేర్కొన్నారు. సింగరేణి లాభాల్లో పెరుగుదలతో పాటు పెరిగిన జీవన వ్యయానికి అనుగుణంగా కాంట్రాక్టు కార్మికుల లాభాల వాటాను కూడా పెంచాలని స్పష్టం చేశారు. సింగరేణి బొగ్గు ఉత్పత్తి, రవాణా, గనుల నిర్వహణ తదితర కీలక పనుల్లో కాంట్రాక్టు కార్మికులు నిరంతరం శ్రమిస్తున్నారని తెలిపారు. సంస్థ ఉత్పత్తి, లాభాల్లో వారి శ్రమకు కూడా భాగస్వామ్యం ఉందని, అందువల్ల లాభాల వాటా విషయంలో కాంట్రాక్టు కార్మికులను విస్మరించకూడద న్నారు. ప్రస్తుతం నిత్యావసర వస్తువులు, కూరగాయలు, విద్య, వైద్యం, రవాణా తదితర ఖర్చులు పెరగడంతో కాంట్రాక్టు కార్మికులపై ఆర్థిక భారం అధికమైందన్నారు. గతేడాది నిర్ణయించిన రూ.5,000 మొత్తాన్ని యథాతథంగా కొనసాగిస్తే ప్రస్తుత ధరల పెరుగుదలకు అది ఏమాత్రం సరిపోదని తెలిపారు .కాంట్రాక్టు కార్మికులకు లాభాల వాటాను ఎంత పెంచాలనే అంశాన్ని కేవలం యాజమాన్య నిర్ణయంగా కాకుండా, కార్మికుల జీవన పరిస్థితులు, వారి శ్రమకు తగిన న్యాయమైన వాటాగా పరిగణించాలని డిమాండ్ చేశారు. సింగరేణి సంస్థకు లాభాలు రావడంలో కాంట్రాక్టు కార్మికుల శ్రమను కూడా గుర్తించి, సంస్థ లాభాల్లో వారికి తగిన ప్రయోజనం కల్పించడం యాజమాన్యం బాధ్యతగా చూడాలని కోరారు. గతేడాది రూ.5,000 చెల్లించారనే కారణంతో ఈ ఏడాది కూడా అదే మొత్తాన్ని నిర్ణయించకుండా, ప్రస్తుత ధరల పెరుగుదల, జీవన వ్యయం, సింగరేణి లాభాలను పరిగణనలోకి తీసుకుని కాంట్రాక్టు కార్మికులకు లాభాల వాటాను గణనీయంగా పెంచి చెల్లించాలని విప్లవ కార్మిక సంఘాలు డిమాండ్ చేశాయి. కాంట్రాక్టు కార్మికుల డిమాండ్‌పై సింగరేణి యాజమాన్యం సానుకూలంగా స్పందించి, గతేడాది రూ.5,000కు పరిమితం కాకుండా పెరిగిన ధరలకు అనుగుణంగా మెరుగైన లాభాల వాటాను ప్రకటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సింగరేణి కాలరీస్ లేబర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి టీ. మణిరామ్ సింగ్, సింగరేణి గని కార్మిక సంఘం (ఎస్‌జీకేఎస్) రాష్ట్ర నాయకులు అంబాల మహేందర్, శ్రామిక శక్తి గోదావరి లోయ బొగ్గు గని కార్మిక సంఘం (ఏఐఎఫ్‌టీయూ) రాష్ట్ర కార్యదర్శి ఎం. పోషమల్లు, కాంట్రాక్టు కార్మికులు లక్ష్మి, కృష్ణవేణి, రాధ తదితరులు పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి పిసిఆర్ ఫౌండేషన్ అండ

రూ.5 వేల ఆర్థిక సాయం



**జన్నారం,అక్టోబర్7(ప్రజాజ్యోతి)**జన్నారం మండలం పొనకల్ గ్రామపంచాయతీ పరిధిలోని చెరుకుగూడకు చెందిన మంత్రి లక్ష్మణ్ ఇటీవల స్వర్గస్తులైన విషయం తెలుసుకున్న పూర్ణ చందర్ రావు ఫౌండేషన్ ప్రతినిధులు మంగళవారం వారి కుటుంబాన్ని పరామర్శించారు.ఈ సందర్భంగా ఫౌండేషన్ వ్యవస్థాపకులు ముదుగు ప్రవీణ్ ఆధ్వర్యంలో మృతుడి కుటుంబానికి రూపాయలు 5 వేలు ఆర్థిక సహాయం అందచేసి మానవత్వాన్ని చాటుకున్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కష్ట సమయంలో బాధిత కుటుంబానికి అండగా నిలవడం తమ బాధ్యతగా భావిస్తున్నామని అన్నారు.ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు నోముల రాజ్ కుమార్, కొత్త శ్రీనివాస్,బాధవత్ సాయి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## పలువురిని పరామర్శించిన బీఆర్ఎస్ నిర్మల్ ఇన్‌చార్జి రామ్‌కిషన్ రెడ్డి



**సారంగాపూర్, అక్టోబర్ 7, ప్రజాజ్యోతి:**మండలంలో బీఆర్ఎస్ పార్టీ నిర్మల్ నియోజకవర్గ ఇన్‌చార్జి కే. రామ్‌కిషన్ రెడ్డి బుధవారం పలు గ్రామాల్లో పర్యటించి ఇటీవల మృతి చెందిన వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.మండలంలోని చించోలి (బి) గ్రామంలో ఇటీవల మృతి చెందిన రిటైర్డ్ ఆర్టీసీ ఉద్యోగి దేవిదాస్ కుటుంబ సభ్యులను, ఆయన కుమారులు, పంచాయతీ సెక్రటరీ హర్షవర్ధన్ను పరామర్శించి కుటుంబానికి తన సానుభూతి తెలిపారు.అనంతరం ఆడెల్లి గ్రామంలో మృతి చెందిన కుమ్మరి మల్లయ్య కుటుంబ సభ్యులను పరామర్శించారు. కంకేట గ్రామంలో ఇటీవల మృతి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు నాగరావు కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించారు. అదేవిధంగా కొంతకాలంగా అనారోగ్య సమస్యతో బాధపడుతున్న జాదవ్ ప్రకాష్ ఇంటికి వెళ్లిన రామ్‌కిషన్ రెడ్డి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ, ప్రజలకు కష్టసుఖాల్లో అండగా నిలవడం బీఆర్ఎస్ పార్టీ నాయకుల బాధ్యత అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ దేవిశంకర్, ఆలూరు మాజీ సర్పంచ్ జీవన్‌రావు, నిర్మల్ పార్టీ కన్వీనర్ మహేష్‌రెడ్డి, మాజీ అడెల్లి పోచమ్మ దేవస్థాన చైర్మన్ లక్ష్మీనారాయణ గౌడ్, కంకేట మాజీ సర్పంచ్ లింగాల విజయలక్ష్మి, నాగన్న, మోతె వారి లక్ష్మణ్, వంగా చంద్రశేఖర్‌రెడ్డి, దత్తురం, బుర్రి రాజు, ఎక్కిలిరి భోజన,గట్టు గంగాధర్, ధనుంజయ్, భాస్కర్, సతీష్ గౌడ్, శ్రీధర్, పవర్ రాజు, సంపెంగల గంగన్న, కృష్ణ, నాకిడి రవి, అలీ తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

**నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలి:**

**అదనపు కలెక్టర్ యువరాజ్ మర్మాట్**

**ఆసిఫాబాద్, అక్టోబర్ 7 (ప్రజా జ్యోతి)** జిల్లాలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్ అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులు, ఇంజనీరింగ్ అధికారులతో అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో 335 గ్రామ సమాఖ్య భవనాలు మంజూరు కాగా 17 భవనాలు పూర్తయ్యాయని, 187 భవనాల పనులు పురోగతిలో ఉన్నాయని తెలిపారు. మిగిలిన భవనాల పనులను వెంటనే ప్రారంభించాలని సూచించారు. 100 గ్రామ పంచాయతీ భవనాలు మంజూరు కాగా 10 చోట్ల పనులు ప్రారంభం కాలేదని, క్షేత్రస్థాయిలో కారణాలను పరిశీలించి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అంగన్వాడీ భవనాలు, ప్రభుత్వ పాఠశాలల్లో అదనపు తరగతి గదులు, ప్రహరీలు, మరుగుదొడ్లు, తాగునీటి సదుపాయాల పనులను వేగంగా పూర్తి



చేయాలని ఆదేశించారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో పీహెచ్‌సీలు, ఆరోగ్య ఉపకేంద్రాల భవన నిర్మాణ పనులు చేపట్టాలని సూచించారు. చేయూత పింఛన్లకు వచ్చిన 9,466 దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్హుల జాబితాను పారదర్శకంగా రూపొందించాలని తెలిపారు. 8,163 స్వయం సహాయక సంఘాల బ్యాంకు లింకేజీ ప్రక్రియ పూర్తి చేయడంతో పాటు ఇందిరమ్మ మహిళా చీరల పంపిణీకి ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. సమావేశంలో డీఆర్డీఓ దత్తారావు, డీపీఓ బిక్షపతి, డీఎంహెచ్ఓ నాగేంద్ర, జెడ్పీ సీఈఓ లక్ష్మీనారాయణ, డీటీడీఓ అంబాజీ, డీఈఓ సచ్చిదానంద చారి తదితరులు పాల్గొన్నారు.

# వన్యప్రాణుల రక్షణే.. మన బాధ్యత

**అడవుల పరిరక్షణతోనే పర్యావరణ సమతుల్యత**

**భవిష్యత్ తరాల కోసం వన్యప్రాణులను కాపాడాలి**

**ఆసిఫాబాద్ అక్టోబర్ 7 (ప్రజా జ్యోతి)** జాతీయ వన్యప్రాణి వారోత్సవాల్లో భాగంగా ఆసిఫాబాద్ అటవీ శాఖ ఆధ్వర్యంలో సర్కేపల్లి, మారేపల్లి గ్రామాల్లో వన్యప్రాణుల సంరక్షణ, అడవుల ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆసిఫాబాద్ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ గోవింద్ చంద్ సర్దార్ ఆదేశాల మేరకు డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ ఝాన్సీ లక్ష్మి గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఝాన్సీ లక్ష్మి మాట్లాడుతూ.. వన్యప్రాణులు, అడవులు పర్యావరణ సమతుల్యతకు ఎంతో కీలకమన్నారు. అడవులను, వన్యప్రాణులను రక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. భవిష్యత్ తరాలకు ప్రకృతి సంపదను అందించాలంటే అడవుల పరిరక్షణకు ప్రజలు సహకరించాలని



కోరారు. గ్రామాల పరిసరాల్లో వన్యప్రాణులు సంచరించినప్పుడు వాటిని ఇబ్బందులకు గురిచేయకుండా అటవీ శాఖకు సమాచారం అందించాలని సూచించారు. వన్యప్రాణుల వేట, అక్రమ రవాణా వంటి చర్యలకు పాల్పడకుండా అప్రమత్తంగా ఉండాలని గ్రామస్తులకు సూచించారు. కార్యక్రమంలో ఎఫ్‌బీవోలు కిషోర్, వెంకటేష్, అనిమల్ ట్రాకర్స్ పాల్గొన్నారు.

# సోషల్ మీడియాలో వ్యక్తిగత వివరాలు పంచుకోవద్దు.ఎస్.ఐ ఉదయ్ కిరణ్

**సైబర్ మోసాలకు గురైతే 1930 కు సమాచారం ఇవ్వాలి**

**జన్నారం,అక్టోబర్7(ప్రజాజ్యోతి)**సోషల్ మీడియాలో వ్యక్తిగత వివరాలు, కుటుంబ వివరాలు,ఆర్థిక వివరాలు వంటి సున్నితమైన సమాచారాన్ని బహిరంగంగా పంచుకోవద్దని ఎస్.ఐ ఉదయ్ కిరణ్ సూచించారు. మండల కేంద్రంలోని ఐటిఐ కళాశాలలో బుధవారం రోజున సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్.ఐ ఉదయ్ కిరణ్ మాట్లాడుతూ ఆన్‌లైన్ మోసాలు, ఫిషింగ్ లింకులు, నకిలీ సోషల్ మీడియా ఖాతాలు, ఫేక్ జాబ్ ఆఫర్లు, డిజిటల్ అరెస్ట్ పేరుతో జరుగుతున్న మోసాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అలాగే ఓటిపి, ఏటీఎం పిన్, సివివి, యూపీఐ పిన్, బ్యాంకు ఖాతా వివరాలు, పాస్‌వర్డ్‌లను ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులతో పంచుకోవద్దని తెలిపారు.తెలియని లింకులు, ఏపీకే ఫైల్స్, అనుమానాస్పద యాప్‌లను డౌన్‌లోడ్ చేయకూడదని, సోషల్ మీడియాలో వచ్చే తప్పుడు వార్తలు, వదంతులను నిర్ధారణ లేకుండా



ఇతరులకు ఫార్వర్డ్ చేయవద్దని సూచించారు.సైబర్ మోసానికి గురైన వెంటనే 1930కు ఫోన్ చేసి, జాతీయ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేయాలని ఎస్సై ఉదయ్ కిరణ్ విద్యార్థులకు సూచించారు.అంతేకాకుండా చెడు వ్యసనాలకు బానిస కాకుండా మంచిగా చదువుకొని భవిష్యత్తులో ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు ఊరికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐటిఐ ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, సూపరింటెండెంట్ భాను,ఏటీఓ శంకర్, సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు

## మహాత్మా జ్యోతిబాపూలే ఓవర్సీస్ విద్యానిధి దరఖాస్తుల గడువు పొడిగింపు

**బీసీ విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి**

**జిల్లా బీసీ అభివృద్ధి అధికారి ఎస్. రాజేశ్వరి**

**మంచిర్యాల, 7, అక్టోబర్ (ప్రజాజ్యోతి):** మహాత్మా జ్యోతిబాపూలే ఓవర్సీస్ విద్యానిధి పథకానికి సంబంధించి 2026 ఆగస్టు, సెప్టెంబర్ ఫాల్ సెషన్‌కు దరఖాస్తు చేసుకునే గడువును ఈ నెల 15వ తేదీ వరకు పొడిగించినట్లు మంచిర్యాల జిల్లా బీసీ అభివృద్ధి అధికారి ఎస్. రాజేశ్వరి తెలిపారు. గతంలో సెప్టెంబర్ 30వ తేదీని చివరి తేదీగా నిర్ణయించగా, మరో 15 రోజుల పాటు గడువు పొడిగిస్తూ అక్టోబర్ 15వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. విదేశాల్లో ఉన్నత విద్య (మాస్టర్స్, డాక్టరేట్) అభ్యసించాలనుకునే బీసీ, ఈబీసీ విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ పథకానికి దరఖాస్తు చేసుకునే విద్యార్థుల కుటుంబ వార్షిక ఆదాయం అన్ని వనరులు కలిపి రూ.5 లక్షలలోపు ఉండాలని, దరఖాస్తు చేసుకునే సమయానికి విద్యార్థి వయస్సు 35 సంవత్సరాలు దాటకూడదని, డిగ్రీ వరకు కనీసం 60 శాతం మార్కులు సాధించి ఉండాలని, అలాగే జీఆర్ఈలో 260 మార్కులు లేదా జీమ్యాట్‌లో 500 మార్కులు ఏదైనా ఒక పరీక్షలో సాధించి ఉండాలన్నారు . అదేవిధంగా టోఫెల్‌లో 60 మార్కులు లేదా ఐఈఎల్‌టీఎస్‌లో 6.0 బ్యాండ్ లేదా పీటీఈలో 50 మార్కులు ఏదైనా ఒక పరీక్షలో సాధించి ఉండాలని తెలిపారు. అర్హత కలిగిన విద్యార్థులు రిజిస్ట్రేషన్‌తో పాటు పూర్తి వివరాల కోసం వెబ్‌సైట్‌ను సందర్శించాలని జిల్లా బీసీ అభివృద్ధి అధికారి ఎస్. రాజేశ్వరి సూచించారు. విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించాలనుకునే అర్హులైన బీసీ, ఈబీసీ విద్యార్థులు గడువు ముగిసేలోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా బీసీ అభివృద్ధి అధికారి కోరారు.

## ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అండర్ 19 వాలీబాల్ జట్టుకు

**టీజీఎంఎస్ మంచిర్యాల విద్యార్థుల ఎంపిక**



**మంచిర్యాల, 7, అక్టోబర్ (ప్రజాజ్యోతి):** ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎస్‌జీఎఫ్ అండర్--19 వాలీబాల్ జోనల్ మీట్‌లో టీజీఎంఎస్ మంచిర్యాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జట్టుకు ఎంపికయ్యారు. బాలికల ఎంపికలను టీజీఎంఎస్ మంచిర్యాలలో, బాలుర ఎంపికలను కాసిపేట గురుకులంలో నిర్వహించారు. టీజీఎంఎస్ మంచిర్యాలకు చెందిన ఎం. రుచిత (ప్రథమ సంవత్సరం సీఈసీ), ఎస్. సాత్విక (ద్వితీయ సంవత్సరం బైపీసీ), సాయి ప్రదీప్ (ద్వితీయ సంవత్సరం సీఈసీ) విద్యార్థులు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అండర్--19 వాలీబాల్ జట్టుకు ఎంపికయ్యారు. ఎంపికైన క్రీడాకారులు 9వ తేదీ నుంచి 11వ తేదీ వరకు రంగారెడ్డిగూడ, జడ్చర్ల, మహబూబ్‌నగర్ జిల్లాలో నిర్వహించే రాష్ట్రస్థాయి అండర్--19 వాలీబాల్ పోటీల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా తరఫున పాల్గొననున్నారు. ఈ సందర్భంగా టీజీఎంఎస్ మంచిర్యాల ప్రిన్సిపాల్ ముత్యం బుచ్చన్న, పీడీ ఎన్. సుదీప్, డీఐఈఓ అంజయ్య, ఎస్‌జీఎఫ్ అండర్--19 సెక్రటరీ బాబురావు లు బుధవారం విద్యార్థులను అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీల్లోనూ ఉత్తమ ప్రతిభ కనబరిచి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

# 12వ జేబీసీసీఐ ఏర్పాటు కోసం వ్యూహాత్మక కార్యాచరణకు ఏబీకేఎంఎస్ పిలుపు

## కార్మికుల హక్కులు, సంక్షేమం కోసం పోరాటమే లక్ష్యం

## పశ్చిమ బెంగాల్ ఈసీఎల్ రాణిగంజ్‌లో 114వ వర్కింగ్ కమిటీ రెండు రోజుల సమావేశం









**మంచిర్యాల, 7, అక్టోబర్ (ప్రజాజ్యోతి):** భారతీయ మజ్దూర్ సంఘ్ (బీఎంఎస్)కు అనుబంధంగా ఉన్న అఖిల భారతీయ ఖదాన్ మజ్దూర్ సంఘ్ (ఏబీకేఎంఎస్) 114వ వర్కింగ్ కమిటీ రెండు రోజుల సమావేశం పశ్చిమ బెంగాల్‌లోని ఈసీఎల్ రాణిగంజ్‌లో గల మిడ్‌వే మ్యారేజ్ హాల్‌లో ఘనంగా జరిగింది. దేశంలోని 9 రాష్ట్రాల నుంచి 93 మంది ప్రతినిధులు ఈ సమావేశానికి హాజరై బొగ్గు పరిశ్రమ కార్మికుల సమస్యలు, హక్కులు, సంక్షేమం, సంస్థాగత బలోపేతం తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. సమావేశంలో ఏబీకేఎంఎస్‌ను మరింత బలోపేతం చేయడం, దేశవ్యాప్తంగా కార్మికుల హక్కుల పరిరక్షణకు సమర్థవంతమైన కార్యాచరణ రూపొందించడం, సంస్థ విస్తరణతో పాటు అంతర్గత సంస్కరణలను వేగవంతం చేయడం వంటి అంశాలకు ప్రాధాన్యత ఇచ్చారు. కార్మికుల సమస్యలను కేవలం చర్చలకే పరిమితం చేయకుండా సంఘటిత శక్తితో పరిష్కార దిశగా ముందుకు తీసుకెళ్లాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా బీఎంఎస్ జాతీయ నాయకులు, బొగ్గు పరిశ్రమల ఇన్‌చార్జి కె. లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, కార్మికుల హక్కులు, అభివృద్ధి, సంక్షేమం కోసం సంఘటితంగా, ఐక్యంగా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. బొగ్గు పరిశ్రమలో మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా సంస్థను మరింత బలోపేతం చేసి, కార్మికుల సమస్యల పరిష్కారానికి సమర్థవంతమైన ఉద్యమాలను నిర్మించాల్సిన అవసరం ఉందని తెలిపారు. జూలై 1, 2026 నుంచి 12వ జాయింట్ బైపార్టైట్ కమిటీ ఫర్ ది కోల్ ఇండస్ట్రీ (జేబీసీసీఐ--12) ఏర్పాటు కావాల్సి ఉన్నప్పటికీ ప్రక్రియలో జాప్యం జరుగుతున్న నేపథ్యంలో, ప్రభుత్వం, బొగ్గు పరిశ్రమ యాజమాన్యాలపై వ్యూహాత్మక ఒత్తిడి తీసుకువచ్చి జేబీసీసీఐ--12ను త్వరితగతిన ఏర్పాటు చేయించేందుకు చేపట్టాల్సిన కార్యాచరణపై సమావేశంలో సుదీర్ఘంగా చర్చించినట్లు ఏబీకేఎంఎస్ కార్యదర్శి పి. మాధవ నాయక్ బుధవారం తెలిపారు. దేశవ్యాప్తంగా బొగ్గు కార్మికుల వేతనాలు, ఉద్యోగ భద్రత, సంక్షేమం, వైద్య సదుపాయాలు, సామాజిక భద్రత, ఇతర హక్కులకు జేబీసీసీఐ కీలక వేదికగా ఉందని ఆయన పేర్కొన్నారు. జేబీసీసీఐ--12 ఏర్పాటు ఆలస్యం కాకుండా ప్రభుత్వం, బొగ్గు పరిశ్రమ యాజమాన్యాలు తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సంఘటిత శక్తితో ఉద్యమాలను నిర్మిస్తామని స్పష్టం చేశారు. ఈ సమావేశానికి బీఎంఎస్ జాతీయ నాయకులు కె. లక్ష్మారెడ్డి ముఖ్యఅతిథిగా, సహప్రభారి సుధీర్ గురుడే, ఏబీకేఎంఎస్ అధ్యక్షులు సంజయ్ సింగ్ చౌదరి, ప్రధాన కార్యదర్శి సుజిత్ కుమార్ సింగ్, సింగరేణి నుంచి ఏబీకేఎంఎస్ కార్యదర్శి పి. మాధవ నాయక్‌తో పాటు దేశంలోని వివిధ రాష్ట్రాలకు

# రోడ్డు ప్రమాదాల నివారణకు సమన్వయ చర్యలు







**బ్లాక్ స్పాట్ల గుర్తింపు, ట్రాఫిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌పై ప్రత్యేక దృష్టి**

**మంచిర్యాల డీసీపీ ఎ.భాస్కర్**

**మంచిర్యాల, 7,అక్టోబర్ (ప్రజా జ్యోతి):** రోడ్డు ప్రమాదాల నివారణ, రహదారి భద్రతకు సంబంధించి వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని మంచిర్యాల డీసీపీ ఎ.భాస్కర్ సూచించారు. రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆదేశాల మేరకు మంచిర్యాల డీసీపీ కార్యాలయంలో మంచిర్యాల, శ్రీరాంపూర్ మున్సిపల్ పరిధిలో రోడ్డు ప్రమాదాల నివారణ, బ్లాక్ స్పాట్ల గుర్తింపు, ట్రాఫిక్ నిర్వహణపై మున్సిపల్, ఆర్అండ్‌బీ, జాతీయ రహదారుల శాఖల అధికారులతో సమన్వయ సమావేశంను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ, బ్లాక్ స్పాట్లు, ప్రమాదకర మలుపులు, కూడళ్లు, రద్దీ ప్రాంతాలు, తరచూ ప్రమాదాలు చోటుచేసుకునే ప్రదేశాలను గుర్తించి తక్షణమే నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రమాదకర ప్రాంతాల్లో సంబంధిత శాఖల సమన్వయంతో రంబుల్ స్ట్రిప్స్, హెచ్చరిక సైన్ బోర్డులు, ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేయాలని తెలిపారు. బై-లేన్ రోడ్లు ప్రధాన రహదారిలో కలిసే ప్రాంతాల్లో వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు సైనేజీలు, స్పీడ్ కంట్రోల్ ఏర్పాట్లు, బారికేడ్లు తదితర భద్రతా చర్యలు చేపట్టాలని ఆర్అండ్‌బీ, మున్సిపల్, జాతీయ రహదారుల శాఖల అధికారులను ఆదేశించారు. ప్రమాదాలకు కారణమవుతున్న ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, అవసరమైన మౌలిక సదుపాయాలు, హెచ్చరిక బోర్డులు, వేగ నియంత్రణ చర్యలు చేపట్టడం ద్వారా రోడ్డు ప్రమాదాలను తగ్గించాలని సూచించారు. మంచిర్యాల పట్టణంలో రోజురోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యలు, వాహనాల రద్దీ, ట్రాఫిక్ నిబంధనల అమలు, ఎన్‌ఫోర్స్‌మెంట్ చర్యలపై సమావేశంలో ప్రధానంగా చర్చించారు. ట్రాఫిక్ నియంత్రణ కేవలం ట్రాఫిక్ పోలీసుల బాధ్యత మాత్రమే కాదని, లా అండ్ ఆర్డర్ పోలీసులు కూడా ట్రాఫిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌లో చురుకుగా భాగస్వాములు కావాలని డీసీపీ సూచించారు. బ్లాక్ స్పాట్ల క్షేత్రస్థాయి పరిశీలన సమావేశం అనంతరం అధికారులు మంచిర్యాల, శ్రీరాంపూర్ పరిధిలోని బ్లాక్ స్పాట్లను క్షేత్రస్థాయిలో సందర్శించి పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో ప్రమాదాలకు దారితీస్తున్న కారణాలను గుర్తించి, తక్షణం చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. ప్రజల భద్రతే ప్రధాన లక్ష్యంగా వివిధ శాఖల సమన్వయంతో రోడ్డు ప్రమాదాల నివారణకు మరింత సమర్థవంతమైన చర్యలు చేపడతామని అధికారులు తెలిపారు. ఈ సమావేశంలో మంచిర్యాల ఏసీపీ ఆర్.ప్రకాష్, శ్రీరాంపూర్ ఇన్‌స్పెక్టర్ అశోక్ కుమార్, మంచిర్యాల పట్టణ ఇన్‌స్పెక్టర్ ప్రమోదరావు, మంచిర్యాల రూరల్ సీఐ రవీందర్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ హస్నన్, ఆర్అండ్‌బీ శాఖ ఈఈ లక్ష్మీనారాయణ, డీఈ జగదీశ్, మంచిర్యాల మున్సిపాలిటీ డీఈ రాజేందర్, ఏఈ దుర్గం మధు, జాతీయ రహదారుల విభాగం సైట్ ఏఈ వినోద్ పాల్గొన్నారు.

# పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

గర్భిణీలు, చిన్నారులు పోషకాహారంపై శ్రద్ధ చూపాలి
పోషణ మాసంతో ఆరోగ్యంపై అవగాహన

**ఆసిఫాబాద్ అక్టోబర్ 7 ప్రజా జ్యోతి** పాడిబండ గ్రామపంచాయతీ పరిధిలోని వట్టివాగు కాలనీలో దిశా మోడల్ పాఠశాల ఆవరణలో బుధవారం పోషణ మాసం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. చిర్రకుంట ఐసీడీఎస్ సూపర్వైజర్ ఎస్.సుజాత ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి గ్రామపంచాయతీ సర్పంచ్ ఆత్రం ఈశ్వరిబాయి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎస్సీఆర్పీ రాథోడ్ రవీందర్ పాల్గొని మాట్లాడారు.ప్రతి ఒక్కరూ ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవడంతో పాటు పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు పోషకాహారంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, విటమిన్లు, ఖనిజ లవణాలు అధికంగా ఉండే ఆహారాన్ని నిత్య జీవితంలో భాగం చేసుకోవాలని తెలిపారు.పోషకాహార లోపంతో అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉన్నందున



అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందుతున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం గర్భిణీలకు పోషకాహారం, వ్యక్తిగత పరిశుభ్రత, సమతుల్య ఆహారం, ఆరోగ్యకరమైన జీవన విధానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో దిశా మోడల్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కుమరం మాధవరావు, అంగన్వాడీ కార్యకర్తలు లక్ష్మి, సరోజ, సునీత, పార్వతి, రత్నమాల, ఆశా వర్కర్లు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి పోలీస్ క్రీడల్లో ఆదిలాబాద్ జిల్లాకు మూడు కాంస్య పతకాలు

బ్యాడ్మింటన్‌లో సత్తా చాటిన జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది
గెజిటెడ్ అధికారుల విభాగంలో ఏఆర్ డీఎస్పీ కమతం ఇంద్రవర్ధన్‌కు కాంస్య పతకం
నాన్ గెజిటెడ్ డబుల్స్ విభాగంలో కానిస్టేబుళ్లు జాదవ్ కిషోర్, కె దేవ్‌రావ్ కు కాంస్య పథకం
విజేతలను అభినందించిన జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్





**ఆదిలాబాద్ బ్యూరో, అక్టోబర్ 7,)(ప్రజా జ్యోతి)** ఇటీవల హైదరా బాద్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోలీస్ క్రీడా పోటీల్లో బ్యా డ్మింటన్ విభాగంలో ఆదిలాబాద్ జిల్లా పోలీస్ అధికారులు, సిబ్బంది ప్రతిభ కనబరిచి మూడు కాంస్య పతకాలను సాధించారు గెజిటెడ్ అధికారుల విభాగంలో బ్యా డ్మింటన్ సింగిల్స్‌లో ఏఆర్ డీఎస్పీ కమతం ఇంద్రవర్ధన్ మూడో స్థానంలో నిలిచి కాంస్య పథకాన్ని సాధించారు. అదేవిధంగా నాన్ గెజి టెడ్ అధికారుల డబుల్స్ బ్యాడ్మింటన్ విభాగంలో జిల్లా పోలీస్ శాఖకు చెందిన కానిస్టేబుళ్లు జాదవ్ కిషోర్, కె దేవ్ రావ్ జంట మూడో స్థానంలో నిలిచి కాంస్య పథకాన్ని సాధించారు. రాష్ట్ర స్థాయి పోలీస్ క్రీడల్లో ప్రతిభ కనబరిచి జిల్లా కీర్తి ప్రతిష్టలను పెంపొందించిన ముగ్గురు విజేతలను జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయానికి ఆహ్వానించి ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా విజేతలకు ప్రశంసాపత్రాలు, మెడల్స్ అందజేసి అభినందనలు తెలిపారు. రాష్ట్రస్థాయిలోనే కాకుండా జాతీయస్థాయి పోలీస్ క్రీడల్లో కూడా ప్రతిభ కనబరుస్తూ ఆదిలాబాద్ జిల్లా పోలీస్ శాఖకు మరింత పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని ఎస్పీ సూ చించారు.



భవిష్యత్తులో మరింత కష్టపడి సాధన చేస్తూ మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో సీసీ కొండరాజు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఈవీఎం గోదాములో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

భద్రతా ఏర్పాట్లు, సీల్స్, సీసీ కెమెరాలపై ఆరా



**ఆసిఫాబాద్, అక్టోబర్ 7 ప్రజా జ్యోతి** ఈవీఎంల భద్రత విషయంలో ఏమాత్రం నిర్లక్ష్యం తగదని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె.హరిత స్పష్టం చేశారు. జిల్లా కేంద్రంలోని ఈవీఎం గోదామును బుధవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. గోదాము సీల్స్, భద్రతా ఏర్పాట్లు, సీసీ కెమెరాల పనితీరు, నిరంతర పర్యవేక్షణకు సంబంధించిన రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు.ఈ సందర్భంగా గోదాము వద్ద 24 గంటలూ పటిష్ట బందోబస్తు కొనసాగించాలని అధికారులను ఆదేశించారు. సీసీ కెమెరాల ద్వారా నిరంతర నిఘా ఉండేలా చర్యలు తీసుకోవాలని, భద్రతా పర్యవేక్షణలో ఎలాంటి లోపాలకు తావులేకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ఈవీఎంల భద్రతకు సంబంధించిన రికార్డులను ఎప్పటికప్పుడు సక్రమంగా నిర్వహించాలని అధికారులకు తెలిపారు. కలెక్టర్ తనిఖీ సందర్భంగా ఎన్నికల విభాగం పర్యవేక్షకులు శ్యాంలాల్, సిబ్బంది ముసావీర్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

## ఇంటి ఆవరణలో గంజాయి సాగు.. మూడు మొక్కలు స్వాధీనం

నిందితుడిపై కేసు నమోదు



**మంచిర్యాల,7, అక్టోబర్ (ప్రజా జ్యోతి):** ఇంటి ఆవరణలో గంజాయి మొక్కలను సాగు చేస్తున్న వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేసి, మూడు గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకున్నారు. రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, మంచిర్యాల డీసీపీ ఎ. భాస్కర్ ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్స్/నార్కోటిక్స్ ఏసీపీ శ్రీనివాస్ రావు, చెన్నూర్ రూరల్ సీఐ కృష్ణ పర్యవేక్షణలో ఈ దాడి నిర్వహించారు.కోటపల్లి ఎస్ఐ శివనీతి రాజశేఖర్, టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ జె. లక్ష్మణరావు పోలీసు సిబ్బందితో కలిసి నమ్మదగిన సమాచారం మేరకు ఎదుళ్లబందం గ్రామానికి చెందిన దుర్గం మహేష్ (33), తండ్రి చంద్రయ్య ఇంటి ఆవరణలో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఇంటి ఆవరణలో గంజాయి మొక్కలను సాగు చేస్తున్న మహేష్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అక్కడ సాగు చేస్తున్న మూడు గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకున్నారు.స్వాధీనం చేసుకున్న మొక్కలను వ్యవసాయ శాఖ ఏఈఓ పరిశీలించి అవి గంజాయి మొక్కలేనని నిర్ధారించారు. వాటిలో రెండు మొక్కలు 12 అంగుళాలు, మరో మొక్క 14 అంగుళాల ఎత్తు ఉన్నట్లు ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు. స్వాధీనం చేసుకున్న మూడు మొక్కల విలువ సుమారు రూ.4,600 ఉంటుందని పోలీసులు అంచనా వేశారు.గంజాయి సాగు, విక్రయాలు, రవాణా, వినియోగానికి పాల్పడే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు. మాదకద్రవ్యాల నిర్మూలనలో భాగంగా అనుమానాస్పద కార్యకలాపాలపై ప్రజలు వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఎస్ఐ రాజశేఖర్ సూచించారు.

# గ్రామాల్లో పరిశుభ్రత, సురక్షిత తాగునీటిపై అవగాహన కల్పించాలి







రూ.3.25 లక్షలతో బాలవికాస నీటి శుద్ధీకరణ పథకం ప్రారంభం

రాష్ట్ర మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి

**మంచిర్యాల, 7,అక్టోబర్ (ప్రజాజ్యోతి):** గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందించడంతో పాటు నీటి వనరుల పరిరక్షణ, పరిశుభ్రతపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగారాలు, గనులు, భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. బుధవారం భీమారం మండలం దాంపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన బాలవికాస నీటి శుద్ధీకరణ పథకాన్ని అధికారులు, ప్రజా ప్రతినిధులతో కలిసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రూ.3 లక్షల 25 వేల వ్యయంతో ఏర్పాటు చేసిన బాలవికాస నీటి శుద్ధీకరణ పథకం గ్రామ ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. కేవలం రూ.5కే 20 లీటర్ల శుద్ధమైన తాగునీటిని అందుబాటులోకి తీసుకురావడం జరుగుతుందని చెప్పారు. నీటిని పొదుపుగా వినియోగించడం, తాగునీటి వనరులను పరిశుభ్రంగా ఉంచడం, నీటి కాలుష్యాన్ని నివారించడం వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. గ్రామాల్లోని నీటి సరఫరా వ్యవస్థను నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ప్రజా సంక్షేమంలో భాగంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకంలో దాంపూర్ గ్రామంలో 72 ఇళ్ల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని మంత్రి తెలిపారు. గృహజ్యోతి పథకం కింద అర్హులైన లబ్ధిదారులకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని, రేషన్ కార్డుదారులకు చౌక ధరల దుకాణాల ద్వారా ఒక్కొక్కరికి 6 కిలోల చొప్పున సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని తెలిపారు.రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా రూ.10 లక్షల విలువైన కార్పొరేట్ స్థాయి వైద్య సేవలను అందిస్తున్నామని, వ్యయపరిమితి దాటిన వారికి ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థిక సహాయం అందిస్తున్నామని తెలిపారు. విద్యారంగ అభివృద్ధిలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో సుమారు 10 వేల మంది ఉపాధ్యాయులను నియమించి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.చెన్నూర్ నియోజకవర్గ పరిధిలోని సోమనపల్లిలో రూ.200 కోట్ల వ్యయంతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలను ఏర్పాటు చేస్తున్నామని మంత్రి తెలిపారు. ప్రజల సౌకర్యార్థం 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రిని ఏర్పాటు చేశామని, త్వరలోనే ప్రారంభించి వైద్య సేవలు అందుబాటులోకి తీసుకువస్తామని చెప్పారు. గ్రామంలో పల్లె దవాఖాన ఏర్పాటుకు శంకుస్థాపన చేశామని, రూ.4 కోట్లతో సీసీ రహదారుల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.బతుకమ్మ వేడుకల కోసం హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయడంతో పాటు బోర్లు ఏర్పాటు చేసి ప్రజలకు నీటిని అందుబాటులోకి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి వివరించారు.. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, సిబ్బంది, ప్రజా ప్రతినిధులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ అభయహస్తం అమలు చేయాలని నిర్మల్‌లో నిరాహార దీక్ష

**సారంగాపూర్,అక్టోబర్ 7, ప్రజాజ్యోతి:**చేవెళ్ల ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌లో కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన అంబేద్కర్ అభయహస్తం పథకాన్ని తక్షణమే అమలు చేసి ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు రూ.12 లక్షల ఆర్థిక సాయం అందించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 9న నిర్మల్ జిల్లాలో నిరాహార దీక్ష చేపట్టనున్నట్లు మాదిగ హక్కుల పరిరక్షణ సమితి తెలంగాణ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు సుంకె ప్రభాకర్ మాదిగ తెలిపారు.నిరాహార దీక్షకు మాదిగ హక్కుల పరిరక్షణ సమితి వ్యవస్థాపకులు మైస ఉపేందర్ మాదిగ హాజరుకానున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు దీక్ష కొనసాగుతుందని పేర్కొన్నారు.ఈ సందర్భంగా సుంకె ప్రభాకర్ మాదిగ మాట్లాడుతూ.. చేవెళ్ల సభలో ప్రకటించిన అంబేద్కర్ అభయహస్తం పథకం కింద ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు రూ.12 లక్షల ఆర్థిక సాయం అందిస్తామని కాంగ్రెస్ ప్రకటించిందని గుర్తుచేశారు. ఐదేళ్లలో ప్రతి బడ్జెట్‌లో తగిన నిధులు కేటాయిస్తామని డిక్లరేషన్‌లో పేర్కొన్నట్లు వార్తా నివేదికలు కూడా వెల్లడించాయి.

అయితే ఈ హామీ అమలుపై ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమాధానం చెప్పాలని సుంకె ప్రభాకర్ మాదిగ డిమాండ్ చేశారు.ఎస్సీ, ఎస్టీల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు కేటాయించి, అంబేద్కర్ అభయహస్తం పథకాన్ని పూర్తి స్థాయిలో అమలు చేయాలని కోరారు. గత ప్రభుత్వం అమలు చేసిన దళితబంధు పథకానికి బదులుగా కొత్త పేరుతో హామీ ఇచ్చినప్పటికీ, ఆ హామీ కార్యరూపం దాల్చలేదని ఆయన విమర్శించారు.ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు అంబేద్కర్ అభయహస్తం పథకాన్ని అమలు చేసి ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ఈ పథకంపై అమలు స్థితిపై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ ఇతర సంఘాలు, రాజకీయ వర్గాలు కూడా డిమాండ్లు చేస్తున్నాయి.

**దీక్షకు తరలిరావాలి**

అక్టోబర్ 9న నిర్మల్ జిల్లాలో నిర్వహించే నిరాహార దీక్షకు దళిత, బహుజన సంఘాల నాయకులు, ప్రజా సంఘాల ప్రతినిధులు, వివిధ ప్రతిపక్ష పార్టీల నాయకులు హాజరై మద్దతు ప్రకటించాలని సుంకె ప్రభాకర్ మాదిగ కోరారు. అదేవిధంగా ఎస్సీ, ఎస్టీల హక్కుల కోసం పెద్ద సంఖ్యలో ప్రజలు దీక్షకు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.



## వేతనాల సమస్య పరిష్కరించాలని కాంట్రాక్ట్ కార్మికుల ఆందోళన

**కార్మికులకు అండగా ఉంటాం**

**అజ్మీరా శ్యామ్ నాయక్**



**ఆసిఫాబాద్అక్టోబర్ 7 ప్రజా జ్యోతి** మెడికల్ కాలేజీలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు తమ వేతనాల చెల్లింపుల విషయంలో సమస్యలు ఎదుర్కొంటున్నామని పేర్కొంటూ ఆందోళన చేపట్టారు. గత మూడు, నాలుగు నెలలుగా వేతనాలు సకాలంలో అందడం లేదని కార్మికులు తెలిపారు. విషయం తెలుసుకున్న ఆసిఫాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇన్‌చార్జి అజ్మీరా శ్యామ్ నాయక్ ధర్నా చేస్తున్న కార్మికుల వద్దకు చేరుకుని వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సంబంధిత కాంట్రాక్టర్‌తో మాట్లాడి కార్మికులు తెలిపిన వేతనాల సమస్యను రెండు రోజుల్లోగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.అలాగే ఈ అంశంపై పోలీసు అధికారులతోనూ మాట్లాడిన శ్యామ్ నాయక్, సంబంధిత కాంట్రాక్టర్‌ను పిలిపించి కార్మికులతో చర్చించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు.కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తనవంతు సహకారం అందిస్తానని శ్యామ్ నాయక్ తెలిపారు. సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్‌తో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రవీందర్, సీనియర్ నాయకులు నిజాం, మండల అధ్యక్షుడు రాపర్తి మురళి, మాజీ సర్పంచ్ కాశయ్య, సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాజేందర్, జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీకాంత్, డిపో కార్యదర్శి సమ్మయ్యతో పాటు కార్మికులు పాల్గొన్నారు.

## వన్యప్రాణుల సంరక్షణపై విద్యార్థులకు అవగాహన



**సారంగాపూర్, అక్టోబర్ 7, ప్రజాజ్యోతి:**72వ వన్యప్రాణి వారోత్సవాల సందర్భంగా మండలంలోని మలక్ చించోలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా అటవీశాఖ అధికారులు విద్యార్థులకు వన్యప్రాణుల ప్రాముఖ్యత, జీవవైవిధ్య పరిరక్షణ, అడవులు--వన్యప్రాణుల సంరక్షణలో విద్యార్థుల పాత్ర తదితర అంశాలపై అవగాహన కల్పించారు. వన్యప్రాణులు పర్యావరణ సమతుల్యతకు ఎంతగానో దోహదపడతాయని, వాటి సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని వివరించారు.అనంతరం విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అటవీశాఖ ఆధ్వర్యంలో ప్రశంసాపత్రాలు, మెమెంటోలు అందజేసి అభినందించారు.ఈ కార్యక్రమంలో రామకృష్ణారావు అటవీ క్షేత్రాధికారి, నిర్మల్; మహ్మద్ నజీర్ ఖాన్, ఉప అటవీ క్షేత్రాధికారి, సారంగాపూర్; పరమేశ్వర్, ప్రధానోపాధ్యాయులు; ఇనాయతుద్దీన్, సీనియర్ అసిస్టెంట్; వెన్నెల, సుజాత, అటవీ సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. "వన్యప్రాణులను కాపాడితేనే ప్రకృతి సమతుల్యతను కాపాడగలం" అనే సందేశంతో కార్యక్రమాన్ని నిర్వహించారు.

## హీరాపూర్ పాఠశాల విద్యార్థులకు యూనిఫాంల పంపిణీ



**ఆసిఫాబాద్ అక్టోబర్ 7** ప్రజా జ్యోతి హీరాపూర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు 9వ వార్డు కౌన్సిలర్ సాలం బిన్ అహ్మద్ యూనిఫాం దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు మెరుగైన విద్య అందించడంతో పాటు పాఠశాలలో అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు తన వంతు కృషి చేస్తానన్నారు. గ్రామంలో విద్య, వైద్యం, తాగునీటికి సంబంధించిన సమస్యలు లేకుండా అవసరమైన చర్యలకు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్థులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పట్టణంలో పారిశుధ్య నిర్వాహణ పై ప్రత్యేక దృష్టి

**మున్సిపల్ చైర్ పర్సన్ అనూష సతీష్**

**పారిశుధ్య సిబ్బంది, వాహన డ్రైవర్లతో ప్రత్యేక సమా వేశం**



**ఆదిలాబాద్ టౌన్, అక్టోబర్ 7, (ప్రజా జ్యోతి)** ఆదిలాబాద్ పట్టణంలో పారిశుధ్య నివారణకు ప్రత్యేక పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ చైర్ పర్స న్ బండారి అనూష సతీష్ తెలిపారు. ఆదిలాబాద్ మున్సిపల్ ఫిల్టర్ బెడ్ వద్ద శాని టేషన్ సిబ్బంది, ట్రాక్టర్లు, టాటా ఏస్ వాహనాల డ్రైవర్లు, శానిటేషన్ జవాన్లు, ఎస్ ఐ లతో మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష సతీష్ బుధవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష సతీష్ మాట్లాడుతూ ఆదిలాబాద్ పట్టణంలో జనాభా, విస్తీర్ణం పెరుగుతున్న నేపథ్యంలో పారిశుధ్య నిర్వాహణపై ప్ర త్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. పట్ట ణంలో ఎక్కడా చెత్త పేరుకు పోకుండా వాహన డ్రైవర్లు తమకు కేటాయించిన ప్రాంతాల్లోని చెత్తను పూర్తిగా తరలించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విధులను తప్పనిసరిగా నిర్వహించి, తమకు కేటాయించిన ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచేలా చూడాలని ఆదేశించారు. విధుల నిర్వహణలో ఏవైనా ఇబ్బందులు ఎదురైతేశాని టేషన్ జవాన్లు, ఎస్ ఐల ద్వారా లేదా నేరుగా తన దృష్టికి తీసుకురావాలని తెలిపారు. సమస్యలను వెంటనే పరిష్క రించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఆదిలాబాద్ పట్టణాన్ని పరిశుభ్రంగా, సుందరంగా తీర్చిదిద్దడంలో శానిటేష న్ సిబ్బంది, ట్రాక్టర్ డ్రైవర్లు, టాటా ఏస్ డ్రైవర్లు, జవాన్లు, ఎస్‌ఐలు సమన్వయంతో పనిచేయాలని ఆమె పి లుపునిచ్చారు. ప్రతి ఒక్క రూ తమ బాధ్యతను సమర్థవంతంగా నిర్వహించి ఆదిలాబాద్ పట్టణాన్ని స్వచ్ఛమైన పట్టణంగా తీర్చిదిద్దేందుకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో శా నిటేషన్ ఎస్‌ఐ శంకర్, జవాన్లు శానిటేషన్ డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

## పాత స్పాట్ వాల్యుయేషన్ పేపర్లకు కొటేషన్లు

**కొటేషన్ గడువు అక్టోబర్ 13 వరకు పొడిగింపు**

**జిల్లా విద్యాశాఖ అధికారి పి. చంద్రయ్య**

**మంచిర్యాల, 7, అక్టోబర్ (ప్రజాజ్యోతి):** పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు సంబంధించి మార్చి 2025, జూన్ 2025లో నిర్వహించిన స్పాట్ వాల్యుయేషన్‌కు సంబంధించిన పాత పేపర్లను విక్రయించేందుకు స్థానికంగా పాత పేపర్లు కొనుగోలు చేసే వారి నుంచి కొటేషన్లు కోరినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి పి. చంద్రయ్య తెలిపారు. కొటేషన్లు సమర్పించే గడువును ఈ నెల 13వ తేదీ వరకు పొడిగించినట్లు ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. పాత స్పాట్ వాల్యుయేషన్ పేపర్లు కొనుగోలు చేయదలచిన వారు జిల్లా విద్యాశాఖ అధికారి, మంచిర్యాల పేరుతో రూ.10 వేల ధరావత్తు సొమ్మును డీడీ రూపంలో తీసుకోవాలని తెలిపారు. కొటేషన్‌తో పాటు డీడీని ఈ నెల 13వ తేదీ సాయంత్రం 4 గంటలలోపు జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయం (ఐడీఓసీ), మంచిర్యాలలో సమర్పించాలని సూచించారు. కొటేషన్‌లో ఒక కిలో పేపర్‌ను కొనుగోలు చేసే ధరను పేర్కొని, దానిని సీల్డ్ కవర్‌లో ఉంచి సమర్పించాలని డీఈఓ పి. చంద్రయ్య తెలిపారు. నిర్ణీత గడువు అనంతరం వచ్చిన కొటేషన్లను స్వీకరించబోమని స్పష్టం చేశారు.

## సోన్ మండలంలో ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్ కాపీల పంపిణీ పాల్గొన్న ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి



**సోన్,అక్టోబర్ 7(ప్రజా జ్యోతి):**నిర్మల్ జిల్లా సోన్ మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్ కాపీల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. వివిధ గ్రామాలకు సంబంధించిన 119 ప్రొసింగ్ కాపీలు అందజేశారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నిర్మల్ నియోజకవర్గ ఎమ్మెల్యే, బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి హాజరయ్యారు. లబ్ధిదారులకు స్వయంగా ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు, ప్రొసీడింగ్ కాపీలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ...."పేదల సొంతింటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యం. గత ప్రభుత్వంలో ఇళ్లు లేక ఎంతో మంది ఇబ్బంది పడ్డారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇల్లు మంజూరు అయ్యేలా చూస్తాం. మంజూరైన వారు త్వరితగతిన ఇంటి నిర్మాణం పూర్తి చేసుకోవాలి. ప్రభుత్వం నుండి వచ్చే విడతల వారీగా బిల్లులు వెంటనే వచ్చేలా అధికారులు చూడాలి" అని అన్నారు.అలాగే లబ్ధిదారులు ఎవరైనా దళారులను నమ్మి మోసపోవద్దని, నేరుగా అధికారులను సంప్రదించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రామకృష్ణ మాట్లాడుతూ మండలంలో మొదటి విడతలో మంజూరైన ఇండ్లకు సంబంధించి పూర్తి వివరాలను లబ్ధిదారులకు వివరించారు. ఎమ్మార్వో సంతోష్ కుమార్ మాట్లాడుతూ స్థలాలకు సంబంధించిన సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు.ఎంపీడీఓ జ్యోతి, పంచాయతీ కార్యదర్శులు, వివిధ గ్రామాల సర్పంచులు, పార్టీ నాయకులు లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీలో ముదిరిన అంతర్గత విభేదాలు

**--పిఎస్ఆర్ రాక్షస రాజకీయం వల్లే కార్యకర్తలు దూరం**

**.. కష్టపడ్డా కార్యకర్తలకే రక్షణ లేదు**

**భవిష్యత్తులో దోచుకున్నదంతా బయట పెడతాం**

**...... ఉప్పలయ్య**

**ధరణి మధుకర్ దమ్ముంటే రాజీనామా చేసి నాపై గెలువు**

**....వేముల సంజీవ్**

**మంచిర్యాల ప్రతినిధి అక్టోబర్ 07(ప్రజాజ్యోతి)** మంచిర్యాల నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీలో అంతర్గత విభేదాలు మరోసారి బహిర్గతమయ్యాయి.కాంగ్రెస్ నాయకుడు మంతెన జగన్‌మోహన్ రావు నివాసంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో పలువురు నాయకులు మంచిర్యాల నియోజకవర్గ ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు, మేయర్ ధర్ని మధుకర్‌పై మంచిర్యాల మాజీ మున్సిపల్ ఛైర్పర్సన్ రావుల ఉప్పలయ్య తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తాము ప్రతిపక్ష పార్టీలో చేరలేదని, కాంగ్రెస్‌లోనే కొనసాగుతూ పార్టీ అంతర్గత సమస్యల పరిష్కారం కోసం జగన్‌మోహన్ రావు వర్గంలో చేరామని స్పష్టం చేశారు.ఎమ్మెల్యేపై అసంతృప్తితో పలువురు కార్పొరేటర్లు,నాయకులు జగన్‌మోహన్ రావు నాయకత్వాన్ని బలపరుస్తున్నారని తెలిపారు. మున్సిపల్ వ్యవహారాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులపై కూడా నాయకులు పలు ఆరోపణలు చేశారు.కమర్షియల్ అనుమతులు, నోటీసులు,సెటిల్‌మెంట్ల పేరుతో అక్రమాలకు పాల్పడుతున్నారంటూ ఎంఎల్ఏ పై విమర్శలు గుప్పించారు.నిర్దిష్ట ఆధారాలను భవిష్యత్తులో బయట పెడతామని పేర్కొన్నారు. ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు తనను జిల్లా నాయకుడిగా చెప్పుకుంటే, పదవికి రాజీనామా చేసి ప్రజల ముందుకు రావాలని సవాల్ విసిరారు.ఆ సవాల్‌ను స్వీకరించాలని డిమాండ్ చేశారు.అనంతరం నస్పూర్ మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ సుర్మిల్ల వేణు మాట్లాడుతూ, ప్రజాప్రతినిధులు,పార్టీ నాయకులపై అనుచిత వ్యాఖ్యలు చేయడం,అసహనంతో వ్యవహరించడం సరికాదన్నారు.కాంగ్రెస్ పార్టీ కోసం గతంలో కష్టపడి పనిచేసిన నిజమైన కార్యకర్తలను పక్కనపెట్టి, ఇతర పార్టీల నుంచి వచ్చిన వారికి ప్రాధాన్యం ఇవ్వడం వల్ల కార్యకర్తల్లో అసంతృప్తి పెరుగుతోందని ఆరోపించారు. మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు విజయానికి గతంలో తామంతా కష్టపడి పనిచేశామని నాయకులు గుర్తుచేశారు. మేయర్ మధుకర్ ప్యారాషూట్ నాయకుడని ఏద్దేవా చేసారు. ఎంఎల్ఏ నిజమైన పార్టీ కోసం పనిచేసిన కార్యకర్తలకు తగిన గుర్తింపు లభించడం లేదని విమర్శించారు.ప్రజాసేవే లక్ష్యంగా తాము కాంగ్రెస్‌లో కొనసాగుతున్నామని, పార్టీలో అంతర్గత సమస్యలను పరిష్కరించుకోవడానికే జగన్‌మోహన్ రావు నాయకత్వాన్ని బలపరుస్తున్నామని తెలిపారు. వేముల సంజీవ్ మాట్లాడుతూ, జగన్‌మోహన్ రావు కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం వద్ద




మంచి పేరు ఉందని పేర్కొన్నారు. ఎమ్మెల్యే తన రాజకీయ చాప్రయోజనాల కోసం జగన్‌మోహన్ రావు పార్టీకి దూరం చేసుకున్నారని ఆరోపించారు.ప్రజాసేవను పక్కనపెట్టి వ్యక్తిగత రాజకీయాలకు ప్రాధాన్యం ఇస్తున్నారంటూ విమర్శలు చేశారు.ఎంఎల్ఏ నిజమైన ప్రజానాయకుడు అనే ఆత్మ విశ్వాసం ఉంటే రాజీనామా చేసి ఎన్నికలకు వెళ్లాలని హితవు పలికారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు వనపర్తి కేత,తోటపల్లి రాజేశ్వరి, సురిమిళ్ల సౌమ్య ఇతర కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# నేరాల నియంత్రణలో ప్రతిభ కనబరిచిన పోలీసు సిబ్బందికి నగదు రివార్డులు, ప్రశంసాపత్రాలు

**గంజాయి నిర్మూలన, దొంగ తనం కేసులో చాకచక్యంగా వ్యవహరించిన సిబ్బందిని అభినందించిన జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్**

**గంజాయి రహిత, నేరరహి త ఆదిలాబాద్ నిర్మాణమే లక్ష్యం**

**ప్రజలు గంజాయి, నేరాలకు సంబంధించిన సమాచారా న్ని నిర్భయంగా పోలీసుల కు అందించాలి**

**ఆదిలాబాద్ బ్యూరో, అక్టోబర్ 7,(ప్రజా జ్యోతి)** నేరాల నియంత్రణ, గంజాయి నిర్మూలనలో సమర్థవంతంగా విధులు నిర్వహిస్తూ నిందితులను పట్టుకోవడంలో కీలకంగా వ్యవహరించిన పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీ ఎస్ బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయానికి ఆహ్వానించి అభినందించారు. ఈ సందర్భం గా సిబ్బందికి నగదురివార్డులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఆదిలాబాద్ టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి విక్ర యిస్తున్నట్లు వచ్చిన సమా చారంతో మహాలక్ష్మివాడకు చెందిన మసూద్ ఏరిజ్జు, విద్యాసాగర్‌లను తనిఖీ చే యగా వారి వద్ద 24 గంజా యి ప్యాకెట్లు లభించాయి. ఈ ఘటనలో ఇద్దరిని అరె స్టు చేసి కేసు నమోదు చే యడంలో కీలకంగా వ్యవ హరించిన ఎస్సై అఖిల్, హె డ్ కానిస్టేబుల్ రమణయ్య, కానిస్టేబుల్ క్రాంతిలను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించి నగదు రివార్డులు, ప్రశం సాపత్రాలు అందజేశారు.అదేవిధంగా, సోమవారం రాత్రి బస్టాండ్ ప్రాంతంలో దొంగతనానికి పాల్పడిన నిందితుడిని రెడ్‌హ్యాండె డ్‌గా పట్టుకుని, బాధితుడి బ్యాగ్‌తో పాటు అందులోని నగదును 100 శాతంరికవ రీ చేయడంలో చాకచక్యంగా వ్యవహరించిన బ్లూకోర్ట్స్ సిబ్బంది ధనరాజ్, ఎన్. శాంతికుమార్‌లను కూడా ఎస్పీ అభినందించారు. డయల్-100 ద్వారా వచ్చిన ఫిర్యా దుపై వెంటనే స్పందించి నిం దితుడిని పట్టుకుని ఆదిలా బాద్ టూ టౌన్ పోలీస్ స్టేష న్ లో కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు చేపట్టిన సిబ్బందికి నగదు రివార్డులు, ప్రశంసాపత్రాలు అందజేశారు.ఇక గంజాయిని ర్మూలనలో భాగంగా సిరికొండ పోలీస్ స్టేషన్ పరిధిలో 98



గంజాయి మొక్కలపై స మాచారం అందించిన కాని స్టేబుల్ కె. యోగేష్‌కు జిల్లా ఎస్పీ రూ.5,000 నగదు రి వార్డు, ప్రశంసాపత్రం అంద జేసి అభినందించారు. గం జాయి నిర్మూలనలో చురు కుగా పనిచేసే సిబ్బందికి ప్రో త్సాహకాలు గంజాయి ని ర్మూలనకు కృషి చేస్తున్న పో లీసు సిబ్బందికి నగదు రివా ర్డులు, సర్వీస్ రివార్డులు, ప్ర శంసాపత్రాలు అందజేసి ప్రో త్సహిస్తామని ఎస్పీ తెలిపా రు. గంజాయి అక్రమ రవాణా, విక్రయాలు, సాగుపై నిరంతరం నిఘా కొనసాగు తుందని స్పష్టం చేశారు.

**ప్రజల సహకారంతో గంజాయి రహిత ఆదిలాబాద్**

జిల్లాలో ఎక్కడైనా గంజాయి మొక్కలు, ఎండు గంజాయి లేదా గంజాయి విక్ర యాలకు సంబంధించిన స మాచారం ఉంటే ప్రజలు నిర్భయంగా పోలీసులకు తెలియజేయాలని ఎస్పీ కోరారు. 8712659973 నంబ ర్‌కు వాట్సాప్ ద్వారా, తమ కు సమీపంలోని పోలీసు సి బ్బంది లేదా అధికారులకు, అలాగే డయల్-100 ద్వారా సమాచారం అందించవచ్చని తెలిపారు.గంజాయి మొక్కలపై సమాచారం అందించిన వారికి ఒక్కో మొక్కకు రూ.50 చొప్పున, ఎండు గంజాయిపై సమాచారం అందించిన వారికి కూడా తగిన నగదు రివార్డు అందజేస్తా మని తెలిపారు. సమాచారం అందించే వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉం చుతామని స్పష్టం చేశారు. ప్రజలు పోలీసులకు సహక రిస్తూ నేరాలు, గంజాయి అక్రమ కార్యకలాపాలపై సమాచారం అందించాలని, ప్రజల భాగస్వామ్యంతో గంజాయి రహిత, నేరరహిత ఆది లాబాద్ జిల్లాను నిర్మించడ మే పోలీసుల లక్ష్యమని జి ల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ తెలిపారు.

## సికెపి కెనాల్‌లో వెంటనే నీటిని విడుదల చేయాలి

**సాగునీటి కోసం రైతుల వినతి**



**ఆదిలాబాద్ బ్యూరో, అక్టోబర్ 7,(ప్రజా జ్యోతి)** చనాకా కొరాట (సికెపి) కెనాల్‌ల ద్వారా నీటిని విడుదల చేసి రైతులను ఆదుకోవాలని ఆప్రాంత రైతులు విజ్ఞప్తి చేశారు.నీపాని గ్రామంతో పాటు చుట్టుపక్కల గ్రామాల రైతుల పంటలకు ప్రస్తుతం సాగునీటి అవసరం ఎంతో ఉందని. సికెపి కెనాల్‌లో డి6 పంపు నీటిని విడుదల చేస్తే అనేక మంది రైతులకు సాగునీటి సౌకర్యం అందు తుందని వారు పేర్కొన్నారు.రైతుల ఇబ్బందులను దృష్టి లో ఉంచుకొని సికెపి కెనాల్‌లో వెంటనే నీటిని విడుదల చేసి, నీపాని, పరిసర గ్రామాల రైతుల పంటలకు సాగునీరు అందించాలని సంబంధిత అధికారులను రైతుల కోరారు. ఈ మేరకు బుదవారం సంబందిత అధి కారులకు వినతిపత్రం సమర్పించారు. రైతు బాగుంటేనే గ్రామం బాగుంటుందని, సాగునీరు అందితేనే పంటలు పండుతాయని రైతులు వాపోయారు. రైతుల సాగు నీ టి సమస్యను అత్యవసరంగా పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

## పత్తి సాగులో ఆధునిక పద్ధతులపై అవగాహన

**క్లోజర్ స్పేసింగ్‌తో అధిక దిగుబడులే లక్ష్యం**



**నేరడిగొండ, అక్టోబర్ 07 (ప్రజాజ్యోతి):**మండలంలోని కుమారి గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో 'క్లోజర్ స్పేసింగ్' (సమీప దూరాల్లో విత్తడం) పద్ధతిలో పత్తి సాగు యాజమాన్యంపై రైతులకు బుధవారం ప్రత్యేక అవగాహన, శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ డి. మోహన్ దాస్ మాట్లాడుతూ.. క్లోజర్ స్పేసింగ్ పద్ధతిలో 90 ఐ 30 సెంటీమీటర్ల దూరంలో పత్తి విత్తనాలను విత్తుకోవడం ద్వారా ఎకరాకు మొక్కల సాంద్రతను పెంచుకోవచ్చని తెలిపారు. ఈ పద్ధతి వల్ల పంట పెరుగుదలకు అనుకూల పరిస్థితులు ఏర్పడటమే కాకుండా, సాగు యాజమాన్యాన్ని శాస్త్రీయ పద్ధతిలో చేపట్టేందుకు వీలుంటుందని వివరించారు. అలాగే సరైన విత్తన మోతాదు, విత్తే విధానం, పంట సంరక్షణ పద్ధతులపై రైతులకు సమగ్రంగా అవగాహన కల్పించారు. ఆధునిక, శాస్త్రీయ పద్ధతులు పాటించి అధిక దిగుబడులు సాధించాలని కోరారు. ఈ శిక్షణ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారిణి కె. కృష్ణవేణి, ఏఈఓ స్రవంతి, పిఏసిఎస్ చైర్మన్ మందుల రమేష్, గ్రామ సర్పంచ్ అగ్గిమల్ల గోదావరి లస్మన్న, ఉప సర్పంచ్ ఆడెపు రవి, మాజీ జెడ్పిటిసి గడ్డం భీమ్ రెడ్డి, వార్డు సభ్యులు, డీసీఎస్ వాలంటీర్లు వార్ల వినోద్, ఎన్. పుల్లన్న, అల్లం అభిలాష్, కే. వినోద్‌లతో పాటు 50 మందికి పైగా రైతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులు క్లోజర్ స్పేసింగ్ పద్ధతిపై తమకున్న సందేహాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.

## బెజ్జంకి అనిల్ కుమార్‌ను కలిసి సన్మానించిన మాజీ యూత్ కాంగ్రెస్ రాష్ట్ర జనరల్ సెక్రెటరీ శశిమాల



**ఆదిలాబాద్ టౌన్, అక్టోబర్ 7, (ప్రజా జ్యోతి)** మాజీ యూత్ కాంగ్రెస్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జనరల్ సెక్రెటరీ శశిమాల బుదవారం ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో మాజీ యూత్ కాంగ్రెస్ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు, మాజీ టీటీడీ బోర్డ్ సభ్యుడు, ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ ఆర్గనైజేషన్ కోఆర్డి నేటర్ బెజ్జంకి అనిల్ కుమార్‌ని మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ బలోపేతం, సంస్థాగత కార్యక్రమాలు, పార్టీ భవిష్యత్ కార్యాచరణ పై నాయకులు చర్చించారు. పార్టీసిద్ధాం తాలను ప్రజల్లోకి తీసు కెళ్లడంతో పాటు, కాంగ్రెస్ పార్టీ ని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు నా యకులు, కార్యకర్తలు సమ న్వయంతో పనిచేయాలని వారు పేర్కొన్నారు. ఈ కార్య క్రమంలో జిల్లా కాంగ్రెస్ సెక్రెటరీ ఇమ్రాన్, పట్టణ కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీ తిరుమణి మహేందర్, కుంట ప్రవీణ్ రెడ్డి, అంకత్ రవి, ప్రెసి డెంట్ ధర్మకీర్తి వాగ్మారే, కృష్ణంరాజు తదితర జిల్లా కాంగ్రెస్ నాయకులు,కార్యకర్త లు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాల నియంత్రణపై ట్రాన్స్పోర్ట్ కమిషనర్ ఇలంబర్తి సమీక్ష లో పాల్గొన్నఎస్పీ డా. జి. జానకి షర్మిల





**ఖానాపూర్ అక్టోబర్ 7 (ప్రజా జ్యోతి)**రోడ్డు ప్రమాదాల నివారణ, రహదారి భద్రతను మెరుగుపరచడం, జీరో ఫాటాలిటీ జిల్లాల సాధనే లక్ష్యంగా రాష్ట్ర డీజీపీ (హోపఫ్ ) ఆధ్వర్యంలో బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ ఇళంబరిది పాల్గొని రోడ్డు భద్రతకు సంబంధించిన అంశాలపై సమీక్షించారు. నిర్మల్ జిల్లా పోలీస్ కార్యాలయం (డీపీవో) నుంచి జిల్లా ఎస్పీ డా.జి. జానకి షర్మిల పాల్గొన్నారు. జిల్లాలో ప్రమాదాలు అధికంగా జరుగుతున్న ప్రాంతాలు, బ్లాక్ స్పాట్లు, అతివేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్, ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘన వంటి ప్రమాద కారణాలపై సమీక్షించారు. జీరో ఫాటాలిటీ లక్ష్య సాధనకు ప్రమాదాలకు దారితీస్తున్న కారణాలను గుర్తించి, అవసరమైన నివారణ చర్యలు చేపట్టాలని, పోలీస్, రవాణా, ఆర్అండ్‌బీ శాఖలు సమన్వయంతో పనిచేయాల ని సూచించారు. అలాగే సేఫ్ లైఫ్ ఫౌండేషన్ మార్గదర్శక్ వెబ్‌సైట్‌లో రోడ్డు ప్రమాదాలు, బ్లాక్ స్పాట్లు, రహదారి భద్రతకు సంబంధించిన వివరాలు, తీసుకుంటున్న నివారణ చర్యలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల,తో పాటు నిర్మల్ డీఎస్పీ పి. శ్రీనివాస్ పాల్గొన్నారు.

## పోషణ మాసం ముగింపు వేడుకల్లో పాల్గొన్న ఏఎంసీ చై ర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి



**ఆదిలాబాద్ బ్యూరో, అక్టోబర్ 7,(ప్రజా జ్యోతి)** మహిళా, శిశు, దివ్యాంగుల మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ, ఆదిలాబాద్ జిల్లా ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో '9వపోషణ మాసం (మన అంగన్‌వాడీ – మన బాధ్యత)' ముగింపు వేడుకలు ఘనంగా నిర్వహించారు. జిల్లా కలె క్టర్ రాజర్షిషా మున్సిపల్ చై ర్‌పర్సన్ బండారి అనూష సతీష్ తో కలిసి ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోషణ మాసం ప్రాముఖ్యత, పిల్లలు, గర్భిణీలలో పౌష్టికాహా రాన్ని పెంపొందించాల్సిన అవసరంపై వక్తలు మాట్లా డారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి (డిడ బ్లుఓ) మిల్కా, డీఈవో మాధవి, డీఎంహెచ్ వో సాధనతో పాటు అంగన్ వాడీ టీచర్లు, ఆయా వర్కర్లు,విద్యార్థులు, ఇతర సంబంధిత శాఖల అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## లక్ష్మణచందా మండల లైట్ సౌండ్ యూనియన్ నూతన కార్యవర్గం ఏర్పాటు





**లక్ష్మణ్ చందా అక్టోబర్ 7 (మన మీ వార్త )** మండల కేంద్రంలోని లైట్ అండ్ సౌండ్ యూనియన్ నూతన కార్యవర్గ సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఇందులో భాగంగా గౌరవ అధ్యక్షులు ఇలాసారం విలాస్,మండల అధ్యక్షులుపుట్టి రవికుమార్, ఉప అధ్యక్షులు గాంధారి రాజశేఖర్,క్యాషియర్ గల్వే ప్రవీణ్ ముఖ్యమైన నిర్ణయాలు మరియు నిబంధనలు రానున్న దేవి నవరాత్రులు అలాగే బతుకమ్మ కార్యక్రమాల కోసం రూ. 15,000/- (పదిహేను వేల రూపాయలు) నిర్ణయించుకోవడం జరిగింది. ఈ నియమనిబంధనలను ఉల్లంఘిస్తే యూనియన్ సభ్యులు తగిన జరిమానా విధించడం జరుగుతుంది. మండల యూనియన్ సభ్యులు సతీష్,అభి, రాజశేఖర్, నవీన్ తరుణ్, సాయి, శ్రీకాంత్, సందీప్, శివమని,నరేష్, గంగాధర్, విజయ్ మండల యూనియన్ సభ్యులు ఉన్నారు.

# పిట్టలవాడ కాలనీలో కమ్యూనిటీ కాంటాక్ట్

**150 మంది పోలీసు సిబ్బందితో విస్తృత తనిఖీలు**

**రోడ్డు భద్రత, మహిళల రక్షణ, గంజాయి పై అవగాహన**

**116 ద్విచక్ర వాహనాలు, 20 ఆటోలు, ఒక కారు తాత్కాలికంగా స్వాధీనం**

**నంబర్ ప్లేట్లు లేని 6, నంబర్ ప్లేట్లు చెరిపివేసిన 2 వాహనాలు స్వాధీనం**

**రౌడీ షీటర్లు, సస్పెక్ట్ షీటర్ల పై నిరంతర తనిఖీలు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్**

**3 బెల్ట్ షాపులపై కేసులు 42 మద్యం క్వార్టర్ బాటిల్స్ స్వాధీనం**







**ఆదిలాబాద్ బ్యూరో, అక్టోబర్ 7,(ప్రజా జ్యోతి)** ప్రజల రక్షణ, భద్రతలో భాగంగా ఆదిలాబాద్ జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తు న్నామని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. ఇందులో భాగంగా బుధవారం ఉదయం 5 గంటల నుంచి ఆదిలాబాద్ పట్టణంలోని పి ట్టలవాడ కాలనీలో సుమారు 150 మంది పోలీసు సి బ్బందితో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. తనిఖీల సందర్భంగా సరైన ధ్రువ పత్రాలు లేని 116 ద్విచక్ర వాహనాలు, 20 ఆటోలు, ఒక కారును తాత్కాలికంగా స్వాధీనం చేసుకున్నారు. నంబర్ ప్లేట్లు లేని 6 వాహనాలు, నంబర్ ప్లేట్లను చెరి పివేసిన 2 వాహనాలను కూడా స్వాధీనం చేసుకున్నారు. వాహనాలకు సంబంధించిన పూర్తి పత్రాలను తప్పనిసరిగా కలిగి ఉండాలని, దొంగ వాహనాలను కొనుగోలు చేయడం లేదా వినియోగించడం నేరమని హెచ్చరించారు వాహనాల నంబర్ ప్లేట్లను చెరిపివేయడం, మార్చడం వంటి చర్యలకు పాల్పడితే చట్టప్రకారం కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు.రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, ద్విచక్ర వాహనదారులు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపవద్దని ఎస్పీ సూచించారు. వాహన దారులు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ తమతో పాటు ఇతరుల ప్రాణాలను కూడా కాపాడాలని కోరారు.అక్రమ మద్యం విక్రయాల పై కూడా తనిఖీలు నిర్వహించగా, 3 బెల్ట్ షాపుల్లో సుమారు 42 మద్యం క్వార్టర్ బాటిల్స్ స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేస్తున్నట్లు తెలిపారు. అక్రమంగా మద్యం విక్రయించి నా, నిల్వ చేసినా చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గంజాయి రహిత ఆదిలాబాద్ కోసం ప్రతి ఒక్కరూ పోలీసు శాఖ కు సహకరించాలని ఎస్పీ కోరారు. యువత గంజాయి కి దూరంగా ఉండాలని, గంజాయి సాగు, విక్రయం, రవాణా, వినియోగానికి పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. గంజాయికి సంబంధించిన సమాచారం ప్రజలు పోలీసుల కు అందించి సమాజాన్ని మత్తు పదార్థాల నుంచి కాపాడే దుకు భాగస్వాములు కావాలని సూచించారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ట్రాఫిక్ చలాన్లను కూడా పలువురు వాహనదారులు చెల్లించగా, మొత్తంరూ.57,110/- చలాన్ల రూపంలో చెల్లించినట్లు తెలిపారు.మహిళలు, చిన్నారుల పట్ల ప్రతి ఒక్కరూ గౌరవంగా వ్యవహరించాలని ఎస్పీ సూచించారు. మహిళలు, చిన్నారుల రక్షణ కోసం జిల్లా పోలీసు యంత్రాంగం షీ టీమ్స్, పోలీస్ అక్క ద్వారా నిరంతరం పని చేస్తుందని తెలిపారు. మహి ళలు, చిన్నారుల పట్ల ఎవరైనా అసభ్యకరంగా ప్రవర్తించినా, వేధింపులకు పాల్పడి నా వెంటనే డయల్ 100కు సమాచారం అందించాలని, బాధ్యులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.రౌడీ షీటర్ల పై సస్పెక్ట్ షీటర్ల పై తనిఖీలు నిర్వహించడం జరుగుతుం దని ప్రవర్తన మార్చుకొని సత్ప్రవర్తనతో ఎదగాలని సూచించారు. ప్రజల భద్రత, నేరాల నియంత్రణ, అసాంఘిక కార్యకలాపాల నివారణలో భాగంగా కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహి స్తామని ఎస్పీ అఖిల్ మహా జన్ తెలిపారు. ప్రజలు పో లీసులకు సహకరిస్తూ సుర క్షితమైన సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాల ని కోరారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఓఎస్డీ బి.సు రేందర్ రావు, పట్టణ సీఐలు బీడీ ప్రేమ్ కుమార్, ప్రణయ్ కుమార్, రహీం పాషా, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు డి. వెంకటి, టి. మురళి, ఎస్ఐలు, స్పెషల్ పార్టీ, మహిళా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# న్యూ కంజర్ భూ సమస్యలకు త్వరలో పరిష్కారం

## చామన్‌పల్లిలో రీ-సర్వే

## పకడ్బందీగా పూర్తి చేయాలి

## జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

**లక్ష్మణ చాంద అక్టోబర్ 7 (ప్రజా జ్యోతి)** లక్ష్మణ చాంద మండలం న్యూ కంజర్, చామన్‌పల్లి గ్రామాల్లో జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా బుధవారం రోజున పర్యటించి భూసమస్యలు, రీ-సర్వే పనుల పురోగతిని పరిశీలించారు. ముందుగా న్యూకంజర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో అధికారులు, గ్రామస్తులతో కలెక్టర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా గ్రామంలో భూముల పట్టాలకు సంబంధించిన సమస్యలను త్వరితగతినపరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమస్యల పరిష్కారంలో గ్రామస్తుల సహకారం కీలకమని పేర్కొన్నారు. భూ సమస్యలపై గ్రామసభలు నిర్వహించి, అర్హత ఉన్న ప్రతి ఒక్కరి సమస్యను పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. భూముల పట్టాలకు సంబంధించి ఎవరికైనా అభ్యంతరాలు లేదా సమస్యలు ఉంటే గ్రామసభల్లో అధికారుల దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ సూచించారు. గ్రామస్తుల సమస్యలను పెండింగ్‌లో ఉంచకుండా అధికారులు చొరవతో పరిష్కరించాలని ఆదేశించారు.అనంతరం



చామన్‌పల్లి గ్రామంలో కొనసాగుతున్న భూముల రీ-సర్వే పనులను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రీ-సర్వే పురోగతి, ఇప్పటివరకు పూర్తయిన పనులు, మిగిలి ఉన్న కమతాల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. మిగిలిన రీ-సర్వే ప్రక్రియను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు.రీ-సర్వేలో పూర్తి పారదర్శకత పాటించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. సర్వే బృందం సిబ్బందిపర్యవేక్షణలో, సంబంధిత భూ కమతాల రైతుల సమక్షంలోనే సర్వే నిర్వహించాలని సూచించారు. సర్వే వివరాల నమోదులో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ఈ పర్యటనలో ఇన్‌చార్జి



అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రాథోడ్ రమేష్, ఆర్డీవో దేవీదాస్, ఏడీ ల్యాండ్ సర్వే రికార్డ్స్ విఠల్,తహసీల్దార్ సరిత, ఎంపీడీవో వనజ, సర్పంచ్‌లు మోహన్‌రెడ్డి, ఐట్ల లక్ష్మి, సుదర్శన్, ఉప సర్పంచ్‌లు ముత్యం, గంగారెడ్డి, సంబంధిత అధికారులు, సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు.

## మార్గమధ్యలో పాస్పోర్ట్ కోల్పోయిన యువకుడు




**కడెం, అక్టోబర్ 7(ప్రజా జ్యోతి):** మండలంలోని లింగాపూర్ గ్రామానికి చెందిన మాదాసు నాగరాజు,తన పాస్పోర్ట్ ను బస్ లో ప్రయాణిస్తుండగా కోల్పోయాడు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం సెప్టెంబర్ 25వ తారీకు రోజున మాదాసు నాగరాజు తన పని నిమిత్తం ఇంటి నుండి బయలుదేరి వెళ్ళి కడెం నుండి ఖానాపూర్ కు బస్ లో వెళుతున్న సమయంలో మార్గమధ్యలో తన ఖ8705949 నెంబర్ గల ఒరిజినల్ పాస్పోర్ట్ కోల్పోవడం జరిగింది అని అన్నాడు. పాస్పోర్ట్ కోల్పోయిన అనంతరం ఆనాటి నుండి నేటి వరకు ఎంత వెతికిన దొరకలేదు అని అన్నాడు. సోషల్ మీడియా తదితర వాటిలో ప్రసారం చేసిన కూడా కోల్పోయిన పాస్పోర్ట్ దొరకడం లేదు అని బాధ పడ్డాడు. పాస్పోర్ట్ అధికారులు స్పందించి మరల కొత్త పాస్పోర్ట్ ఇప్పించగలరు అని మాదాసు నాగరాజు అధికారులను కోరుతున్నాడు.

## ఆదిలాబాద్ కు చేరుకున్న మీడియా అకాడమీ చైర్మన్

**ఘణంగా స్వాగతం పలికిన జిల్లా కలెక్టర్**





**ఆదిలాబాద్ బ్యూరో, అక్టోబర్ 7,(ప్రజా జ్యోతి)** మీడియా ప్రతినిధులకు అక్టోబర్ 8,9 తేదీల్లో రెండు రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్న నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి బుధవారం సాయంత్రం జిల్లా కేంద్రంలోని పెన్‌గంగా గెస్ట్‌హౌస్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజర్షిషా, అదనపు కలెక్టర్ రాజేశ్వర్, డీపీఆర్వో విష్ణువర్ధన్, పర్యాటక శాఖ అధికారి రవికుమార్, మీడియా ప్రతినిధులు రాజేశ్వర్, దేవేందర్, సురేష్ షాహిద్, వినోద్, వెంకటేష్, కిరణ్ త దితరులు శ్రీనివాస్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కలు అందజేసి స్వాగతం పలికారు.రెండు రోజుల శిక్షణలో మీడియా రంగంలో వస్తున్న మార్పులు, ఆధునిక సాంకేతికత వినియోగం, వృత్తిపరమైన నైపుణ్యాల పెంపుదల తదితర అంశాలపై మీడియా ప్రతినిధులకు అవగాహన క ల్పించనున్నారు

## ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటుకు రైతుల సహకారం ముఖ్యం:

**జిల్లా కలెక్టర్ రాజర్షిషా**



**ఆదిలాబాద్ బ్యూరో, అక్టోబర్ 7,(ప్రజా జ్యోతి)** జిల్లాలో ప్రతిపాదిత నూత న పారిశ్రామిక పార్కు (ఇం డస్ట్రియల్ పార్క్) ఏర్పాటు ప్రక్రియను వేగవంతం చే యాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా స్పష్టం చేశారు. బుధవా రం కలెక్టరేట్ ఛాంబర్‌లో బో రజ్ మండలంలోని గిమ్మ, రాంపూర్, గూడ గ్రామాల రైతులు, సంబంధిత అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లా డుతూ, భూములు కోల్పో తున్న రైతులకు ప్రభుత్వం నుండి న్యాయమైన రీతిలో పరిహారం, పునరావాస చర్యలు అందజేస్తామని హా మీ ఇచ్చారు. భూసేకరణ ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా నిర్వహించాలని అధికారుల ను ఆదేశించారు. ఈ ప్రాజెక్టు ద్వారా జిల్లాలో ఆర్థిక పురోగతి సాధ్యమవుతుందని, రైతులు సహకరించాలని కోరారు. ఈ కార్య క్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, ఆర్డీవో జగదీశ్వర్ రావ్, ల్యాండ్ సర్వే ఏడీ ప్రభాకర్, ఆయా మండలాల తహసిల్దార్లు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## మాల వర్గానికి ఎస్సీ రోస్టర్‌తో అన్యాయం: హక్కుల సాధనకు కదలిరండి



**నేరడిగొండ, అక్టోబర్ 07 (ప్రజాజ్యోతి):** నేరడిగొండ మండల కేంద్రంలో మాల, మాల ఉపకులాల సంక్షేమ సంఘం సమావేశం బుధవారం నిర్వహించారు. మండల అధ్యక్షులు నక్క మహేందర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి జిల్లా నాయకులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు కొప్పుల రమేష్ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ, రోస్టర్ విధానంలో మాల వర్గానికి తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగాల భర్తీతో పాటు విద్యాసంస్థల్లో విద్యార్థులకు కేటాయించే సీట్ల విషయంలోనూ మాలలకు నష్టం జరుగుతోందని తెలిపారు. ఈ అంశాలపై మాల సమాజం ఐక్యంగా పోరాడి తమ హక్కులను సాధించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ నెల 11న జిల్లా మాల సంఘ భవనంలో నిర్వహించనున్న ముఖ్యమైన సమావేశానికి రాష్ట్ర అధ్యక్షులు, రాష్ట్ర స్థాయి నాయకులు హాజరుకానున్నట్లు కొప్పుల రమేష్ తెలిపారు. మండలంలోని మాల సోదరులు, నాయకులు, యువకులు పెద్ద సంఖ్యలో హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మాల ఉద్యోగుల సంఘం అసోసియేట్ అధ్యక్షులు బొమ్మెత సుభాష్, మాల సంక్షేమ సంఘం అసోసియేట్ అధ్యక్షులు ముచ్చ రఘు, సీనియర్ నాయకులు సింగరి అశోక్, మేధరి స్వామి, మండల ప్రధాన కార్యదర్శి కుర్మే నారాయణ స్వామి, ఉపాధ్యక్షులు మద్దెల నారాయణ స్వామి, సీనియర్ నాయకులు మద్దెల చందర్, దావుల ప్రశాంత్, దావుల శ్రీనివాస్, ఆకుల అశోక్, అనుపట్ల సంజీవ్, మహేందర్, బోగి లక్ష్మణ్, అభిలాష్‌తో పాటు వివిధ గ్రామాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

## అత్యంత పారదర్శకంగా అంగన్వాడీ టీచర్ నియామ క ఇంటర్వ్యూలు

**జిల్లా కలెక్టర్ రాజర్షిషా**



**ఆదిలాబాద్ బ్యూరో, అక్టోబర్ 7,(ప్రజా జ్యోతి)** గాదిగూడ మండలంలోని వివిధ అంగన్వాడీ కేంద్రాల్లో టీచర్ల నియామక ఇంట ర్వ్యూ ప్రక్రియను పూర్తిగా పారదర్శకమైన విధానంలో విజయవంతంగా నిర్వహించినట్లు జిల్లా కలెక్టర్ రాజర్షి షా స్పష్టం చేశారు. బుధవా రం కలెక్టరేట్ సమావేశ మం దిరంలో ఐటీడీఏ పీవో మం ద మకరందుతో కలిసి ఆ యన అభ్యర్థులకు ఇంట ర్వ్యూలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రా జర్షిషా మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మహిళా శిశు సంక్షేమాన్ని బలోపేతం చే యడంలో అంగన్వాడీ కేం ద్రాల పాత్ర కీలకమని తెలిపారు. అర్హులైన ప్రతి అభ్య ర్థికీ సమాన అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతోనే ఈ అంగన్వాడీ టీచర్ నియామక ప్రక్రియను పకడ్బందీగా చేపట్టామన్నారు. ఈ నియా మకానికి సంబంధించి మొత్తం 283 దరఖాస్తులురాగా, అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి 47 మందిని అర్హులుగా, మిగతా 236 దరఖాస్తులు అనర్హతగా గుర్తించారని తెలిపారు. అర్హత సాధించిన 47 మందిలో 46 మంది అభ్యర్థులు ఇంట ర్వ్యూలకు హాజరుకాగా, కేవలం ఒక్కరు మాత్రమే గైర్హాజరయ్యారని వివరించారు. ఎంపిక ప్రక్రియలో పూర్తిగా మెరిట్, నిబంధనలకే పెద్దపీట వేసినట్లు ఆయన పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సం క్షేమ అధికారి మిల్కా, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి సాధన, గిరిజన సంక్షేమ శా ఖ డి.డి. అశోక్, ఇతర సంబంధిత శాఖల అధికారులు, అభ్యర్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మహిళా సంఘాలకు ఆర్థిక చేయూత

**జిల్లా కలెక్టర్ రాజర్షిషా**



**ఆదిలాబాద్ బ్యూరో, అక్టోబర్ 7,(ప్రజా జ్యోతి)** మహిళా సంఘాల ఆర్థికాభివృద్దే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. రామ్‌ల్యాం' అమలులో భాగంగా ఎన్ఆర్ఎల్ఎం ప థకం కింద బుధవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఆదిలాబాదు గ్రామీణ మండలం రాజర్షిషాగూడ గ్రామానికి చెందిన అర్హులైన మహి ళ సంఘాల సభ్యులకు ఆయన ఆర్థిక సహాయం చె క్కులను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లా డుతూ, ఈ పథకం అమలు లో భాగంగా గొర్రెలు, మేకల పెంపకాన్ని ప్రోత్సహించేందు కు ఝాన్సీ లక్ష్మీ, అంజలి మహిళా సంఘాలను గుర్తించి వారికి ఆర్థిక సహాయాన్ని అందించడం జరిగిందన్నారు. ఈ పథకం ద్వారా ఒక్కో గ్రూపులో నలుగురు సభ్యుల చొప్పున గుర్తించి, వారికి రూ. 1 లక్ష చొప్పున (ఒక్కొక్కరికి రూ. 25,000) రుణం అందించామని తెలిపారు. ఈ ఆర్థిక సహాయంతో మ హిళలు మేకల పెంపకం చేపట్టి, వాటిని సక్రమంగా పెంపకం చేసుకుంటూ ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిఆర్డీఓ రవీందర్ రాథోడ్, ఏపిఎం అనిల్, డిపిఎం శోభా, సంబంధిత అధికారులు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

# అంగన్‌వాడీ కేంద్రాలు ప్రీ- స్కూళ్లుగా తీర్చిదిద్దాలి



జిల్లా కలెక్టర్ రాజర్షిషా





**ఆదిలాబాద్ బ్యూరో, అక్టోబర్ 7,(ప్రజా జ్యోతి)** జిల్లాలో పోషణ మాసం వే డుకలను పకడ్బందీగా నిర్వ హించడంతో పాటు అంగన్ వాడీ కేంద్రాలను ప్రీ–స్కూళ్లుగా తీర్చిదిద్ది పిల్లల ప్రాథమిక విద్యాభ్యాసంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక జడ్పీ సమావేశ మందిరంలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో "పోషణ మా సం -- 2026", "అంతర్జాతీ య బాలికల దినోత్సవం -- 2026" వేడుకలను ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారం భించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తొలి 1000 రోజులలో పిల్లల మా నసిక వికాసానికి ప్రాధాన్య తనివ్వాలని, ప్రభుత్వం అందించిన పుస్తకాలు, డిజిటల్ సాధనాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అంగన్‌వాడీలకు అందే సరు కుల్లో నాణ్యత చాలా ము ఖ్యమని, కోడిగుడ్లు తప్పని సరిగా 45 నుండి 50 గ్రాము ల బరువు ఉండాలని, త క్కువ బరువున్నవాటిని త క్షణమే తిరస్కరించి వెనక్కి పంపాలని స్పష్టం చేశారు. అలాగే అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల ఖాళీల భర్తీ ప్రక్రియను రిజర్వేషన్ నిబంధనల ప్రకారం పారదర్శ కంగా పూర్తి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా సిడి పిఓలకు పోషణ చాంపియ న్ అవార్డ్స్ ను, విద్యార్థుల కు న్యూట్రిషన్ కిట్ లను అందజేశారు. అనంతరం అనీమియా నియంత్రణ పోస్టర్ ను కలెక్టర్ ఆవిష్కరించి, అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్క రించుకొని బాల్య వివాహాల నిర్మూలనకు అతిథులు సంతకాలను చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బం డారి అనూష, మార్కెట్ క మిటీ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, డిఎంహెచ్ఓ సాధన, శిశు సంక్షేమ శాఖ అధికారి మిల్కా, డిఈఓ మాధవి, ఇత ర అధికారులు, సీడీపీవోలు, అంగన్వాడిలు, తదితరులు పాల్గొన్నారు.

# దశల వారిగా అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు





ఇండ్ల మంజూరు లో దళారులను ఆశ్రయించవద్దు

భైంసా మండలం లో 175 మందికి ఇండ్ల మంజూరు పత్రాలు అందించిన ఎమ్మెల్యే రామారావ్ పటేల్



**బాసర అక్టోబర్ 7 (ప్రజా జ్యోతి)** దశలవారీగా అర్హులందరికీ ఇండ్లు మంజూరు చేయిస్తానని, ఇండ్ల మంజూరు కాని వారు ఆందోళన చెందవద్దని ఎమ్మెల్యే రామారావ్ పటేల్ సూచించారు. బుధవారం భైంసా ఎంపీడీవో కార్యాలయంలో ఆయా గ్రామాలకు చెందిన 175 మందికి ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలు అందించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇప్పటివరకు మండలంలో పెద్ద మొత్తంలో ఇండ్లు మంజూరు చేయడం జరిగిందని, రెండు సంవత్సరాల్లో అర్హులందరికీ ఇల్లు ఇస్తామని చెప్పారు. గత పది సంవత్సరాల బి ఆర్ఎస్ పాలనలో భైంసా మండలంలో తిమ్మాపూర్, హంపోలి, దేగాం గ్రామాలకు 150 వరకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు మంజూరు చేయించారని, వాటి వ్యవస్థ అధ్వానంగా ఉందన్నారు. 10 సంవత్సరాల్లో పాలకుల నిర్లక్ష్యం వల్ల పేదవాళ్లకు డబుల్ బెడ్రూమ్ ఇల్లు మంజూరు కాలేదన్నారు. తన హాయంలో ఇందిరమ్మ ద్వారా పెద్ద మొత్తంలో ఇండ్లు మంజూరు కావడం సంతోషంగా ఉందన్నారు.

**ఇందిరమ్మ లబ్ధిదారులు ఎవ్వరికీ డబ్బులు ఇవ్వవద్దు**

ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారులు ఎవరికి డబ్బులు ఇవ్వవద్దని, దళారులను ఆశ్రయించవద్దని ఎమ్మెల్యే రామారావ్ పటేల్ సూచించారు. పేదవాడికి ప్రభుత్వం ఐదు లక్షల రూపాయలు ఇస్తే, కొందరు మాయ మాటలు చెప్పి వారి దగ్గర నుండి డబ్బులు వసూలు చేయడం సరికాదన్నారు. ఎవరికీ డబ్బులు ఇవ్వవద్దని, దళారుల బారిన పడి మోసపోవద్దన్నారు. అర్హులందరికి ఇండ్లు ఇప్పిస్తానన్నారు. నియోజకవర్గానికి పెద్ద మొత్తంలో ఇండ్లు మంజూరు చేయించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి, ఇంచార్జ్ మంత్రికి ఆయన కృతజ్ఞతలు చెప్పారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనందరావు పటేల్, పిఎసిఎస్ చైర్మన్ దేవేందర్ రెడ్డి, సర్పంచుల సంఘం అధ్యక్షులు పండిత్ రావు పటేల్, ఆయా గ్రామాల సర్పంచ్ లు, నాయకులు లబ్ధిదారులు పాల్గొన్నారు.

## పాఠశాలకు సీలింగ్ ఫ్యాన్ అందజేత



**లక్షణ చాంద, అక్టోబర్ 7 (ప్రజాజ్యోతి)** మండల కేంద్రంలోని తిరుపల్లి ప్రాథమిక పాఠశాలకు గ్రామ వి డి సి సభ్యులు శ్రీలత, చిన్నయ్య పాఠశాల గదిలో వేడి ఉండి విద్యార్థులకు ఫ్యాన్ అవసరం ఉన్న కారణంగా మంగళ వారం రోజున విరాళంగా సీలింగ్ ఫ్యాన్ ను పాఠశాలకు అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గిరిజా, రవి, ఉప సర్పంచ్ ప్రవీణ్ పాఠశాల సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

## సింగరేణి మోటార్ల చోరీకి అడ్డుకట్ట.

అనుమానాస్పద వ్యాన్‌లో రెండు ఖరీదైన మోటార్ల స్వాధీనం.ఎంటీ.ఎఫ్ సిబ్బందిని అభినందించిన జీఎం.



**మందమర్రి, అక్టోబర్ 07(ప్రజాజ్యోతి ):** సింగరేణి సంస్థకు చెందిన విలువైన ఆస్తుల చోరీకి ఎంటీఎఫ్ (మొబైల్ ట్రాన్స్‌పోర్ట్ ఫోర్స్) సిబ్బంది అడ్డుకట్ట వేశారు. అప్రమత్తంగా వ్యవహరించి రెండు ఖరీదైన విద్యుత్ మోటార్లను అక్రమంగా తరలిస్తున్న వ్యాన్‌ను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. బుధవారం తెల్లవారుజామున సుమారు 5 గంటల సమయంలో మందమర్రి ఏరియాలోని మంజునాథ ఫంక్షన్ హాల్ ఎదురుగా ఉన్న సోలార్ ప్లాంట్ సమీపంలో ఎంటీఎఫ్ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. ఈ సమయంలో అనుమానాస్పదంగా ఓ వ్యాన్ కనిపించడంతో సిబ్బంది అప్రమత్తమై వాహనాన్ని తనిఖీ చేశారు. అందులో సింగరేణి సంస్థకు చెందిన రెండు ఖరీదైన విద్యుత్ మోటార్లు ఉన్నట్లు గుర్తించారు. వెంటనే మోటార్లతో పాటు వ్యాన్‌ను స్వాధీనం చేసుకుని, సంబంధిత వ్యక్తులను అదుపులోకి తీసుకుని సెక్యూరిటీ కార్యాలయానికి తరలించారు. సంస్థ ఆస్తులను పరి రక్షించడంలో ఎస్అండ్‌పీసీ (సెక్యూరిటీ), ఎంటీఎఫ్ సిబ్బంది అప్రమత్తతను మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధా కృష్ణ అభినందించారు. సకాలంలో స్పందించి సంస్థ ఆస్తులను కాపాడిన సిబ్బందిని ప్రత్యేకంగా సన్మానించారు. శాలువాలతో సత్కరించి జ్ఞాపికలు, బహుమతులను అందజేశారు. ఈ సందర్భం గా జీఎం రాధాకృష్ణ మాట్లాడుతూ.. సింగరేణి సంస్థ ఆస్తులు ప్రతి ఉద్యోగి, కార్మికుడి బాధ్యత అని అన్నారు. సంస్థ ఆస్తుల పరిరక్షణ కు సెక్యూరిటీ విభాగం సిబ్బంది అహర్నిశలు అప్రమత్తంగా విధులు నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించి చోరీలను అరికట్టేందుకు సహకరించాలని సూచించారు. సంస్థ ఆస్తుల పరిరక్షణతో నష్టాలను నివారించి సంస్థను లాభాల బాటలో నడిపించేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. సంస్థ అభివృద్ధి సాధించి నప్పుడే కార్మికులు, ఉద్యోగుల సంక్షేమం మరింత మెరుగుపడు తుందని తెలిపారు. భవిష్యత్తులోనూ సెక్యూరిటీ సిబ్బంది ఇదే అప్రమత్తతతో విధులు నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో (ఎస్.ఓ.టు.జియం), జి.ఎల్. ప్రసాద్, డీజీఎం (పర్సనల్) సిహెచ్. అశోక్, ఏరియా సెక్యూరిటీ ఆఫీసర్ వెంకటేశ్వర్ రెడ్డి, సెక్యూరిటీ సిబ్బంది పాల్గొన్నారు.

# 2028లో సిర్పూర్ (టి) నియోజకవర్గం ఎమ్మెల్యే బరిలో తెలంగాణ ఉద్యమ నేత మాజీ ఎమ్మెల్యే కావేటి సమ్మయ్య పెద్ద కోడలు కావేటి సబిత మనోహర్

## ప్రజల మన్ననలు పొందడమే లక్ష్యం ఎల్లవేళలా సిర్పూర్-టి నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటా

## తెలంగాణ ఉద్యమ స్ఫూర్తితో ప్రజాసేవకు అంకితం:

## మౌలిక సదుపాయాలు, నిరుద్యోగ సమస్యలపై ప్రత్యేక దృష్టి:.....



**అక్టోబర్ 07:సిర్పూర్-టి కానిస్టెన్సీ కరస్పాండెంట్ ప్రజాజ్యోతి:** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ (టి) నియోజక వర్గంలోని సిర్పూర్ కాగజ్నగర్ మండలానికి చెందిన ఉద్యమ నేత మాజీ ఎమ్మెల్యే కావేటి సమ్మయ్య పెద్ద కోడలు కావేటి సబితా మనోహర్ ప్రజల మండలాలు పొందడమే లక్ష్యంగా ఎల్లవేళలా తెలంగాణ రాష్ట్రంలోనే మొట్టమొదట 001, నియోజకవర్గం సిర్పూర్ (టి) కానిస్టెన్సీ ప్రజలకు అందుబాటులో ఉంటానని అన్నారు. ఉద్యమ స్ఫూర్తితో ప్రజాసేవకు అంకితం చేస్తానని తెలిపారు. మౌలిక సదుపాయాలు నిరుద్యోగ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తానని అన్నారు. 2028 సిర్పూర్(టి) ఎమ్మెల్యే భారీలో ఉంటానని స్పష్టం చేశారు. అసెంబ్లీ ఎన్నికల రాజకీయ వాతావరణం ఇప్పటి నుంచే ఆసక్తిని రేకెత్తిస్తోందని అన్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణ రక్షణ సేన సమితి నుంచి 2028 అసెంబ్లీ ఎన్నికల్లో సిర్పూర్(టి) నియోజక వర్గం ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేయనున్నట్లు మాజీ శాసనసభ్యులు కావేటి సమ్మయ్య పెద్ద కోడలు కావేటి సబిత ప్రకటించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ నియోజకవర్గ అభివృద్ధి కోసం పనిచేయాలనే సంకల్పంతో రాజకీయాల్లో ముందుకు వస్తున్నట్లు ఆమె తెలిపారు. సిర్పూర్(టి) నియోజకవర్గ ప్రజల మన్ననలు పొందడం తన ప్రధాన లక్ష్యమని కావేటి సబిత పేర్కొన్నారు. రాజకీయాలు కేవలం పదవి కోసం కాకుండా ప్రజలకు సేవ చేసే వేదికగా ఉండాలని తాను భావిస్తున్నానని తెలిపారు. ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని, వాటి పరిష్కారం కోసం ప్రభుత్వంతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలనే ఉద్దేశంతో ఉన్నట్లు ఆమె వెల్లడించారు.

**తెలంగాణ ఉద్యమ స్ఫూర్తితో రాజకీయ ప్రస్థానం**

తెలంగాణ ఉద్యమం మా ఇంట్లోనే ఉంది మా మామ కాబట్టి సమ్మయ్య తెలంగాణ ఉద్యమకారుడు తెలంగాణ రావడం కోసం పోరాడిన వ్యక్తి రెండుసార్లు సిర్పూర్ నియోజకవర్గం నుండి ఎమ్మెల్యేగా గెలిచి నియోజకవర్గ ప్రజలకు ఎంతో సేవ చేశారని కావేటి సబిత తెలిపారు తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన ఉద్యమ స్ఫూర్తి తమ కుటుంబంలో ఉందని, ప్రజల హక్కులు, ప్రాంత అభివృద్ధి, సామాజిక న్యాయం కోసం పనిచేయాలనే ఆలోచన తనలో బలంగా ఉందని తెలిపారు. అదే స్ఫూర్తితో సిర్పూర్ (టి) నియోజకవర్గ ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశంతో రాజకీయాల్లోకి వస్తున్నట్లు చెప్పారు. ప్రజలకు కష్టసమయంలో అండగా నిలబడే నాయకత్వం అవసరమని, ప్రజలకు అందుబాటులో ఉండే వ్యక్తిగా తనను తాను నిరూపించుకోవాలని భావిస్తున్నట్లు ఆమె తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు.

**ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటా**



సిర్పూర్(టి) నియోజక వర్గంలోని ప్రతి గ్రామం, ప్రతి ప్రాంత ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండేలా తన కార్యాచరణ ఉంటుందని కావేటి సబిత తెలిపారు. ప్రజలు తమ సమస్యలను చెప్పుకోవడానికి నాయకుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఉండకూడదని, ప్రజల వద్దకే వెళ్లి సమస్యలను తెలుసుకోవాలనే ఉద్దేశంతో ఉన్నట్లు పేర్కొన్నారు. ప్రజలు తనను ఒక రాజకీయ నాయకురాలిగా మాత్రమే కాకుండా తమ సమస్యలను వినే వ్యక్తిగా భావించేలా పనిచేస్తానని తెలిపారు. నియోజకవర్గంలో పర్యటిస్తూ ప్రజల అభిప్రాయాలను తెలుసుకోవడం, గ్రామాల్లోని సమస్యలను గుర్తించడం, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడం వంటి కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇస్తానని అన్నారు.

**మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యం**

సిర్పూర్(టి) నియోజక వర్గ అభివృద్ధిలో మౌలిక సదుపాయాలు కీలకమని కావేటి సబిత పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు, తాగునీరు, డ్రైనేజీ, విద్యుత్, వీధి దీపాలు, విద్య, వైద్యం వంటి ప్రాథమిక అవసరాలపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు.ప్రజలు నిత్యజీవితంలో ఎదుర్కొంటున్న మౌలిక సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి కృషి చేయడం తన ప్రాధాన్య అంశాల్లో ఒకటని తెలిపారు. అభివృద్ధి అనేది పట్టణ ప్రాంతాలకే పరిమితం కాకుండా నియోజకవర్గంలోని మారుమూల గ్రామాలకు కూడా చేరాలని ఆమె అభిప్రాయపడ్డారు.ప్రతి గ్రామంలో ప్రజలకు అవసరమైన సదుపాయాలు అందుబాటులో ఉండేలా ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరువ చేయడానికి కృషి చేస్తానని తెలిపారు. అభివృద్ధి పనుల్లో పారదర్శకత, ప్రజల భాగస్వామ్యం ఉండాలని ఆమె పేర్కొన్నారు.

**నిరుద్యోగ సమస్యపై ప్రత్యేక దృష్టి**

సిర్పూర్(టి) నియోజక వర్గంలో యువతకు ఉపాధి అవకాశాలు పెరగాల్సిన అవసరం ఉందని కావేటి సబిత అన్నారు. చదువుకున్న యువత ఉద్యోగాల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి తగ్గించేందుకు స్థానికంగా ఉపాధి అవకాశాలపై దృష్టి పెట్టాలని పేర్కొన్నారు. నిరుద్యోగ యువత సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలు, ఉద్యోగ సమాచారం వంటి అంశాల్లో యువతకు సహకారం అందించే దిశగా కృషి చేస్తానని తెలిపారు. యువత తమ సామర్థ్యాలను వినియోగించుకుని ముందుకు వెళ్లేందుకు అవసరమైన అవకాశాలు కల్పించేందుకు తన వంతు ప్రయత్నం చేస్తానని అన్నారు.

**ప్రజలే బలం.. ప్రజలే మార్గదర్శకులు**

సిర్పూర్(టి) నియోజక వర్గ ప్రజలే తనకు ప్రధాన బలమని కావేటి సబిత పేర్కొన్నారు. ప్రజల ఆశలు, ఆకాంక్షలను తెలుసుకుని వాటికి అనుగుణంగా పనిచేయడమే తన రాజకీయ లక్ష్యమని తెలిపారు. ఎన్నికల సమయంలో మాత్రమే ప్రజల వద్దకు వెళ్లే విధానం కాకుండా, నిరంతరం ప్రజల మధ్య ఉండే రాజకీయ సంస్కృతిని తీసుకురావాలని తాను కోరుకుంటున్నట్లు చెప్పారు.ప్రజల సమస్యలను వినడం, వాటిపై స్పందించడం, సాధ్యమైన పరిష్కారాలను చూపించడం తన బాధ్యతగా భావిస్తున్నానని పేర్కొన్నారు. సిర్పూర్ (టి)నియోజకవర్గంలోని ప్రతి వర్గానికి సమాన ప్రాధాన్యం ఇస్తూ, ఎలాంటి వివక్ష లేకుండా ప్రజాసేవ చేయాలనే సంకల్పంతో ముందుకు సాగుతున్నట్లు తెలిపారు.



**అభివృద్ధి, ఉపాధి, ప్రజాసేవే ప్రధాన ఎజెండా**

సిర్పూర్(టి) నియోజక వర్గంలో అభివృద్ధి, యువతకు ఉపాధి, మౌలిక సదుపాయాల మెరుగుదల, ప్రజలకు అందుబాటులో ఉండే నాయకత్వం వంటి అంశాలను ప్రధానంగా తీసుకుని ముందుకు సాగనున్నట్లు కావేటి సబిత తెలిపారు. ప్రజల సమస్యలను రాజకీయ కోణంలో కాకుండా మానవతా దృక్పథంతో చూడాల్సిన అవసరం ఉందన్నారు. 2028 ఎన్నికల్లో తెలంగాణ రక్షణ సేన సమితి తరపున సిర్పూర్(టి) నియోజకవర్గం నుంచి పోటీ చేయాలనే తన నిర్ణయం వెనుక ప్రజాసేవ చేయాలనే ఆకాంక్ష ఉందని ఆమె స్పష్టం చేశారు. ప్రజలు తనను ఆశీర్వదించి అవకాశం ఇస్తే నియోజకవర్గ అభివృద్ధికి తన శక్తి మేరకు కృషి చేస్తానని తెలిపారు.

**పదవి కోసం కాదు.. ప్రజల కోసం పనిచేయాలనేదే నా లక్ష్యం**

సిర్పూర్(టి)ప్రజల సమస్యలను తన సమస్యలుగా భావించి పనిచేస్తానని కావేటి సబిత అన్నారు.ప్రజల నమ్మకాన్ని సంపాదించుకోవడం, వారి మన్ననలు పొందడం, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండడం తన రాజకీయ ప్రయాణంలో ముఖ్యమైన అంశాలని పేర్కొన్నారు. మా మామ కావేటి సమ్మయ్య ఆశయ సాధన తెలంగాణ ఉద్యమ స్ఫూర్తి తో ప్రజల కోసం పనిచేయాలనే భావంతో ముందుకు వస్తున్నాను. సిర్పూర్(టి) నియోజక వర్గ ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేయాలని కోరుకుంటున్నాను. 2028లో తెలంగాణ రక్షణ సేన సమితి నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసి ప్రజల ఆశీర్వాదం, మద్దతుతో సిర్పూర్(టి) నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని కావేటి సబిత పేర్కొన్నారు. సిర్పూర్- (టి)నియోజకవర్గ రాజకీయాల్లో 2028 ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఇప్పటి నుంచే నాయకులు, ఆశావహులు తమ కార్యాచరణను ప్రారంభిస్తున్న నేపథ్యంలో కావేటి సబిత ప్రకటన కూడా రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. రాబోయే రోజుల్లో ఆమె చేపట్టే ప్రజా కార్యక్రమాలు, గ్రామాల పర్యటనలు, యువతతో సమావేశాలు, స్థానిక సమస్యలపై స్పందన వంటి అంశాలు ఆమె రాజకీయ ప్రస్థానానికి కీలకంగా మారనున్నాయి.

# నిర్ణీత గడువులోగా ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తి చేయాలి

**అర్హులైన ఒక్క ఓటరు కూడా ఓటు హక్కు కోల్పోకుండా చర్యలు : విద్యాశాఖ కార్యదర్శి, జిల్లా ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ యోగితా రాణా**



**మంచిర్యాల, 7,అక్టోబర్ (ప్రజా జ్యోతి):** జిల్లాలో చేపట్టిన ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి, జిల్లా ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ యోగితా రాణా అధికారులను ఆదేశించారు.బుధవారం నస్పూర్ లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్లు పి.చంద్రయ్య, వి.రాములు, జిల్లా రెవెన్యూ అధికారి మోతిరామ్, మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాసరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ చంద్రకళ, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ విలాయత్ అలీ, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధరణి మధుకర్‌తో కలిసి ఎ.ఈ.ఆర్.ఓలు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎస్ఐఆర్–2026 ప్రక్రియపై సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా యోగితా రాణా మాట్లాడుతూ ఎస్ఐఆర్–2026లో భాగంగా జిల్లాలో మ్యాపింగ్ కాని, అన మోలీస్ ఓటర్లకు సంబంధించిన నోటీసుల పంపిణీ పూర్తయింద న్నారు. జిల్లాలో మూడు ఈ.ఆర్.ఓలు, 18 ఎ.ఈ.ఆర్.ఓలు, అదనంగా కేటాయించిన మరో 18 ఎ.ఈ.ఆర్.ఓలు క్లెయిమ్స్, అభ్యంతరాల ప్రక్రియపై పనిచేస్తున్నారని తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి అర్హుడికి ఓటు హక్కు ఉండేలా చర్యలు తీసుకోవాలని రాజకీయ పార్టీల ప్రతినిధులకు సూచించారు.నోటీసులు జారీ అయిన ప్రతి ఓటరు సంబంధిత పత్రాలను సమర్పించేలా అవగాహన కల్పించాలని, భారత ఎన్నికల సంఘం సూచించిన 11 రకాల పత్రాల్లో సంబంధిత పత్రాలను మాత్రమే స్వీకరించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. నిర్ణీత గడువులోగా క్లెయిమ్స్, అభ్యంతరాల ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. అవసరమైన చోట నిబంధనల ప్రకారం కుల ధ్రువీకరణ పత్రాలను అందజేయాలని సూచించారు.ఒకే కుటుంబానికి చెందిన ఓటర్లందరూ వీలైనంతవరకు ఒకే పోలింగ్ కేంద్రంలో ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఫారం–7 ద్వారా అందిన దరఖాస్తులను మరణ ధ్రువీకరణ పత్రం, సంబంధిత కుటుంబ సభ్యుల ఆమోదం వంటి వివరాలను పరిశీలించిన అనంతరం మాత్రమే పరిష్కరించాలని సూచించారు. అర్హత కలిగిన ఏ ఒక్కరూ ఓటు హక్కును కోల్పోకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని స్పష్టం చేశారు.బూత్ స్థాయి ఏజెంట్లకు అవసరమైన సమాచారాన్ని బూత్ స్థాయి అధికారుల ద్వారా అందించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఫారం–7 దరఖాస్తుల పరిశీలనకు సంబంధించి బూత్ స్థాయి అధికారులు ప్రత్యేక రిజిస్టర్ నిర్వహించి పూర్తి వివరాలను నమోదు చేయాలని ఆదేశించారు. కమ్యూనిటీ సర్టిఫికెట్లను నిబంధనల ప్రకారం త్వరితగతిన జారీ చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. బూత్ స్థాయి అధికారులు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో తరచూ సమావేశాలు నిర్వహించి ఎస్ఐఆర్ ప్రక్రియకు సంబంధించిన వివరాలను తెలియజేయాలని యోగితా రాణా సూచించారు.అంతకుముందు జిల్లాకు చేరుకున్న యోగితా రాణా, జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములుతో కలిసి జైపూర్ మండలం ఇందారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన 111, 112 పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. అక్కడి బూత్ స్థాయి అధికారులను వివరాలు అడిగి తెలుసుకుని ఎస్ఐఆర్ ప్రక్రియపై పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, సిబ్బంది, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# సోనాల ఉన్నత పాఠశాలకు ప్రధానోపాధ్యాయుడి నియామకం



**సోనాల, అక్టోబర్ 07 ( ప్రజాజ్యోతి ):** మండల కేంద్రంలోని సోనాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ఇన్‌చార్జ్ ప్రధాన ఉపాధ్యాయుడిగా రాజేంద్రప్రసాద్ నియామకం జరిగింది. పాఠశాలలో ఖాళీగా ఉన్న ప్రధాన ఉపాధ్యాయ స్థానంలో సీనియర్ ఉపాధ్యాయుడిని ఇన్‌చార్జ్ హెచ్‌ఎమ్‌గా నియమిస్తూ సంబంధిత విద్యాశాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఇన్‌చార్జ్ ప్రధాన ఉపాధ్యాయుడికి పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్థులు మరియు పాఠశాల నిర్వహణ కమిటీ సభ్యులు అభినందనలు తెలిపారు. పాఠశాల అభివృద్ధికి, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడానికి తగిన కృషి చేస్తానని ఈ సందర్భంగా నూతన ఇన్‌చార్జ్ హెచ్‌ఎమ్ తెలిపారు.

# ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా కార్యవర్గ సభ్యుడిగా ఎన్నికైన ఇంజనీర్ కోల అన్నారెడ్డికి ఘన సన్మానం.

**కరీంనగర్** ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, కరీంనగర్ జిల్లా కార్యవర్గ సభ్యుడిగా ఎన్నికైన ఇంజనీర్ కోల అన్నారెడ్డి ని అభినందిస్తూ నేడు అచీవర్స్ యాక్టివ్ హై స్కూల్, కరీంనగర్లో ఘనంగా సన్మానించారు.అచీవర్స్ యాక్టివ్ హై స్కూల్ మరియు అలయన్స్ క్లబ్ నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కోల అన్నారెడ్డి ని శాలువాతో సత్కరించి, ఆయన సాధించిన విజయానికి హృదయపూర్వక అభినందనలు తెలిపారు. సమాజ సేవలో మరింత ముందుకు సాగుతూ ప్రజలకు విశిష్ట సేవలు అందించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో చెర్మాల వెంకటేశ్వర్లు, చెర్మాల పల్లవి, పవన్ కుమార్ వైద్య. డా. ఎ. శ్రీనివాస్ , కొంజర్ల మహేష్,పూలాల శ్యామ్, చింతల కిషన్ తదితరులు పాల్గొన్నారు. అలయన్స్ క్లబ్ బృంద సభ్యులు, ఇతర ప్రముఖులు కోల అన్నారెడ్డి కి అభినందనలు తెలియజేసి, భవిష్యత్తులో ఆయన మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టి మంచి గుర్తింపు పొందాలని ఆకాంక్షించారు.

# గ్రీన్ భద్రాద్రి స్ఫూర్తితో వరంగల్‌లో పర్యావరణ సంస్థ

**భద్రాద్రి కొత్తగూడెం** పర్యావరణ పరిరక్షణలో చేపడుతున్న కార్యక్రమాలు ఇతర ప్రాంతాలకు స్ఫూర్తిగా నిలుస్తున్నాయి. గ్రీన్ భద్రాద్రి స్ఫూర్తితో వరంగల్‌లోనూ పర్యావరణ పరిరక్షణకు అంకితమై పనిచేసే సంస్థను ఏర్పాటు చేయనున్నట్లు కడారి ఫౌండేషన్ ప్రతినిధులు తెలిపారు.మంగళవారం ఉదయం 11 గంటలకు భద్రాచలంలో గ్రీన్ భద్రాద్రి ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. గ్రీన్ భద్రాద్రి ఫౌండర్, హనుమకొండ అడిషనల్ కలెక్టర్ వై.వి. గణేష్ ఐఏఎస్ సూచన మేరకు కడారి ఫౌండేషన్‌కు చెందిన కడారి శ్రీనివాసు, వారి మిత్రబృందం భద్రాచలానికి చేరుకుని గ్రీన్ భద్రాద్రి సభ్యులతో సమావేశమయ్యారు.ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణ, మొక్కల నాటడం, నాటిన మొక్కలను సంరక్షించడం, ప్రజల్లో పచ్చదనంపై అవగాహన కల్పించడం, విస్తృత స్థాయిలో పర్యావరణ కార్యక్రమాలను నిర్వహించడం వంటి అంశాలపై గ్రీన్ భద్రాద్రి సభ్యులతో కడారి ఫౌండేషన్ ప్రతినిధులు చర్చించారు. వరంగల్‌లో కూడా గ్రీన్ భద్రాద్రి తరహాలో పర్యావరణ సంస్థను ఏర్పాటు చేసి, వివిధ ప్రాంతాల్లో పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమాలు చేపట్టాలని వారు పేర్కొన్నారు.అనంతరం గ్రీన్ భద్రాద్రి

# అత్యవసర సేవలకు మరింత పటిష్ఠత

**108--102 సేవలకు జనార్ధన్ బాధ్యతలు**

**సిరికొండ, అక్టోబర్ 7( ప్రజా జ్యోతి )**ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు నూతన కార్యక్రమ నిర్వాహకుడిగా బుధవారం జనార్ధన్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో 108--102 అత్యవసర సేవల సిబ్బంది ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం జనార్ధన్ మాట్లాడుతూ ప్రజలకు అత్యవసర సేవలను మరింత వేగంగా, సమర్థవంతంగా అందించేందుకు సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. జిల్లాలో 108--102 సేవలను మరింత బలోపేతం చేసేందుకు సిబ్బందితో కలిసి కృషి చేస్తానని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు సకాలంలో సేవలు అందేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో 108--102 సిబ్బంది పాల్గొని నూతన కార్యక్రమ నిర్వాహకుడు జనార్ధన్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ విషయాన్ని ఆదిలాబాద్ జిల్లా 108 సమన్వయకర్త సూరం శేఖర్ తెలిపారు.

# ప్రజా సమస్యల పరిష్కారంలో జర్నలిస్టులు, యంత్రాంగం కలిసి పనిచేయాలి

**మీడియా కథనాలపై తక్షణమే స్పందిస్తాం: కలెక్టర్ కె.హరిత**






**ఆసిఫాబాద్, అక్టోబర్ 7 ప్రజా జ్యోతి** ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో జర్నలిస్టులు, వాటి పరిష్కారానికి ప్రభుత్వ యంత్రాంగం సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని రోజ్‌గార్డెన్‌లో టీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు.జర్నలిస్టులు, ప్రభుత్వ అధికారులు ప్రజాక్షేత్రంలోనే పనిచేస్తున్నారని, ప్రజా సమస్యల పరిష్కారంలో ఇరువర్గాలు ఒక టీమ్‌గా వ్యవహరించాలని సూచించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను మీడియా ద్వారా అధికారుల దృష్టికి తీసుకొస్తే వాటిని పరిష్కరించే బాధ్యత జిల్లా యంత్రాంగం తీసుకుంటుందని తెలిపారు. పత్రికలు, మీడియాలో ప్రచురితమయ్యే వార్తలను నిశితంగా పరిశీలిస్తున్నామని, తక్షణ పరిష్కారం సాధ్యమైన సమస్యలపై వెంటనే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. దీర్ఘకాలిక సమస్యలు, విచారణ అవసరమైన అంశాలను ప్రాధాన్యత క్రమంలో పరిశీలిస్తామని పేర్కొన్నారు.మీడియా రంగంలో మహిళా జర్నలిస్టుల సంఖ్య తక్కువగా ఉండటం బాధాకరమని, భవిష్యత్‌లో మరింత మంది మహిళలు జర్నలిజం రంగంలోకి రావాలని ఆకాంక్షించారు. జిల్లా అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం జర్నలిస్టుల సహకారం నిరంతరం ఉండాలని కోరారు. జర్నలిస్టుల సమస్యలపై కూడా సానుకూలంగా స్పందిస్తామని కలెక్టర్ తెలిపారు.కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే నాయకులు వరాహత్ అలీ, ప్రధాన కార్యదర్శి రాంనారాయణ,జిల్లా అధ్యక్షులు అబ్దుల్ రహమాన్ కార్యదర్శి సంపత్ కుమార్ పలువురు పాత్రికేయులు పాల్గొన్నారు.

# సింగరేణిలో మారుతున్న అటెండెన్స్ విధానం

### ముఖ గుర్తింపు ద్వారానే హాజరు.. 12 నుంచి మాన్యువల్ అటెండెన్స్‌కు స్వస్తి

**మంచిర్యాల, 7,అక్టోబర్ (ప్రజా జ్యోతి):**సింగరేణి సంస్థలో అటెండెన్స్ (హాజరు) విధానంలో కీలక మార్పులు చోటుచేసుకోనున్నాయి. కార్పొరేట్ కార్యాలయంలో పనిచేస్తున్న ఎగ్జిక్యూటీవ్‌లు, ఎన్‌సీడబ్ల్యూఏ ఉద్యోగుల హాజరును ఇకపై ముఖ గుర్తింపు ఆధారిత హాజరు విధానం ద్వారా మాత్రమే నమోదు చేయాలని యాజమాన్యం నిర్ణయించింది. ఈ మేరకు సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ కార్పొరేట్ పర్సనల్ డిపార్ట్‌మెంట్ నుంచి ఈ నెల 7న సర్క్యులర్ జారీ అయింది.కార్పొరేట్ కార్యాలయంలోని నిర్దిష్ట ప్రదేశాల్లో ఏర్పాటు చేసిన ఫేస్ రికగ్నిషన్ సిస్టమ్ (ఎఫ్ఆర్ఎస్) పరికరాల ద్వారా ఎగ్జిక్యూటీవ్‌లు, ఎన్‌సీడబ్ల్యూఏ ఉద్యోగులు తమ ఇన్, ఔట్ హాజరును నమోదు చేసుకోవాలని గతంలోనే ఆదేశాలు జారీ చేసినప్పటికీ, కొంతమంది ఉద్యోగులు ఈ విధానాన్ని పాటించడం లేదని యాజమాన్యం గుర్తించింది. దీంతో ఉద్యోగులందరూ తప్పనిసరిగా ఏర్పాటు చేసిన ఎఫ్ఆర్ఎస్ పరికరాల వద్ద తమ ఇన్, ఔట్ హాజరును నమోదు చేసుకోవాలని మరోసారి స్పష్టం చేసింది. ఈనెల 12 నుంచి ఎఫ్ఆర్ఎస్ హాజరుకే ప్రాధాన్యం కార్పొరేట్ కార్యాలయంలో 12.10.2026 నుంచి ఎఫ్ఆర్ఎస్ ద్వారా నమోదైన హాజరును మాత్రమే పరిగణనలోకి తీసుకుంటామని సింగరేణి యాజమాన్యం స్పష్టం చేసింది. కొత్తగా చేరిన ఉద్యోగులు, బదిలీపై వచ్చిన ఉద్యోగులు, ఇంకా ఎఫ్ఆర్ఎస్‌లో నమోదు కాని ఉద్యోగుల వివరాలను కార్పొరేట్ ఐటీ విభాగంలో నమోదు చేయనున్నట్లు తెలిపింది. ఎఫ్ఆర్ఎస్ పరికరాల ద్వారా నమోదైన హాజరును ఒక రోజులో రికార్డు చేసేందుకు ఎస్ఏపీ-హెచ్ఆర్‌లో "వైసీహెచ్‌బిఎఫ్ ఆర్ఎస్‌బిఏటీటీ" అనే టీ-కోడ్‌ను అభివృద్ధి చేసినట్లు సర్క్యులర్‌లో స్పష్టంగా వివరించారు. కొత్త నియామకాలు, బదిలీలపై ఉద్యోగులు




విధుల్లో చేరే సమయంలో హాజరు నమోదు కాకపోతే, సంబంధిత నిబంధనల ప్రకారం యోడ్ మస్టర్ విధానం ద్వారా దానిని క్రమబద్ధీకరించవచ్చని తెలిపారు. ఇప్పటి వరకు "వైసీహెచ్‌బిడిపార్ట్ బిఏటీటీ" టీ-కోడ్ ద్వారా మాన్యువల్‌గా హాజరు నమోదు చేసే విధానం అమల్లో ఉండగా, 12.10.2026 నుంచి ఈ విధానాన్ని రద్దు చేయనున్నట్లు యాజమాన్యం ప్రకటించింది. ఇకపై ఎఫ్ఆర్ఎస్ ద్వారా నమోదైన హాజరుకే ప్రాధాన్యం ఉంటుందని స్పష్టం చేసింది. ఉద్యోగులందరూ కొత్త హాజరు విధానాన్ని తప్పనిసరిగా పాటిస్తూ యాజమాన్యానికి సహకరించాలని కోరింది.

# కొనసాగుతున్న రుతుపవనాల నిష్క్రమణ

**హైదరాబాద్ :** తెలుగురాష్ట్రాలకు భారత వాతావరణ శాఖ చల్లటి కబురు చెప్పింది. శీతాకాలంలో కూడా వేసవి తలపించే ఉక్కపోత నుంచి తెలుగురాష్ట్రాల ప్రజలకు ఉపశమనం కల్పిస్తూ.. నేడు ఏపీ, తెలంగాణలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. బంగాళాకాతంలోని ఉపరితల ఆవర్తనం, నైరుతి రుతుపవనాల ఉపసంహరణ కొనసాగుతున్న ప్రభావంతో ఈ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అంచనా వేసింది. అలాగే కొన్ని ప్రాంతాల్లో పొడి వాతావరణం, మరికొన్ని ప్రాంతాల్లో ఉక్కపోతలు కూడా ఉంటాయని స్పష్టం చేసింది.ముఖ్యంగా హైదరాబాద్ నగరంలో ఉదయం పూట ఆహ్లాదకరమైన చల్లని వాతావరణం, చల్లటి గాలులు వీస్తాయని.. మధ్యాహ్నం మాత్రం నిన్నటితో పోల్చుకుంటే ఒకటి రెండు రేట్లు ఎక్కవగానే ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని అంచానా వేసింది. దీంతో మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు నగరవాసుల ఉక్కపోతను ఎదుర్కోవసి రావచ్చు.. ఇక సాయంత్రం మళ్లీ వాతావరణం మారుతుంది. సాయంత్రం సమయంలో నగరంలో చాలా ప్రాంతాల్లో తేలిపాటి నుంచి మోస్తారు వర్షాలు కురిసే ఛాన్స్ ఉందని వాతావరణ శాఖ తెలిపింది.ఇక రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పలు జిల్లాల్లో కూడా ఇదే తరహా వాతావరణం ఉంటుందని వాతావరణ శాఖ అంచనా వేసింది. కొన్ని జిల్లాల్లో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, నల్గొండ, సూర్యాపేట, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, రంగారెడ్డిలో మాత్రం నేడు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడే ఛాన్స్ ఉందని తెలిపింది. వర్షాల సమయంలో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల



వేగంతో బలమైన గాలులు కూడా వీస్తాయని అంచనా వేసింది.బంగాళాఖాతంలోని ఉపరితల ఆవర్తనం ప్రభావంతో నేడు ఏపీలోని పలు ప్రాంతాల్లో వర్షాలు కురిసే చాన్స్ ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది. ముఖ్యంగా తీరప్రాంత జిల్లాలైన విశాఖపట్నం, అనకాపల్లి, విజయనగరం, శ్రీకాకుళంలో మోస్తరు నుంచి తేలికపాటి వర్షాలు పడే ఛాన్స్ ఉందని అంచానా వేసింది. అలాగే దక్షిణ కోస్తా, రాయలసీమలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి వర్షాలు కురిసే ఛాన్స్ ఉందని వాతావరణ శాఖ తెలిపింది.